PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

### అమాంతం పెరిగిన ముడి చమురు ధరలు, భారత్‌పై ప్రభావమెంత?

ఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేశాయి. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయడంతో ముడి చమురు ధరలు అమాంతం పెరిగాయి. కీలకమైన పశ్చిమాసియా ప్రాంతం నుంచి చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న ఆందోళనలతో, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర శనివారం బ్యారెల్‌కు 6 డాలర్లకు పైగా పెరిగి, ఐదు నెలల గరిష్ఠ స్థాయి 78 డాలర్లకు చేరింది. ఇరాన్ కూడా టెల్ అవీవ్‌పై దాడులకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల వల్ల ఇంధన వ్యయాలు పెరిగి, రవాణా ఖర్చులు కూడా అధికమవుతాయి. ప్రపంచ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న భయాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి. ఎస్-పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ విశ్లేషకుల ప్రకారం, ఈ దాడులు సమీప భవిష్యత్తులో చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దోహదపడినప్పటికీ, చమురు ఎగుమతులపై ప్రత్యక్ష ప్రభావం పడితే తప్ప ఈ ధరల ఒత్తిడి నిలకడగా ఉండకపోవచ్చు. "గతంలో ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పరం దాడులు చేసుకున్నప్పుడు కూడా ధరలు పెరిగాయి, కానీ పరిస్థితి అదుపులోకి వచ్చి, చమురు సరఫరాపై ప్రభావం లేదని తేలగానే తగ్గాయి" అని ఎస్-పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ స్వల్పకాలిక చమురు విశ్లేషణ విభాగం హెడ్ రిచర్డ్ జోస్విక్ ఏఎన్ఐ వార్తా సంస్థకు తెలిపారు. భారత్ నేరుగా ఇరాన్ నుంచి పెద్ద మొత్తంలో చమురును దిగుమతి చేసుకోకపోయినప్పటికీ, తన అవసరాల్లో దాదాపు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఇరాన్, అరేబియా ద్వీపకల్పం మధ్య ఉన్న స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్, ప్రపంచ ఎల్ఎన్‌జి వాణిజ్యంలో దాదాపు 20 శాతం, గణనీయమైన ముడి చమురు ఎగుమతులకు కీలక మార్గం. ఈ మార్గంలో ఏదైనా అంతరాయం ఏర్పడితే, భారత్‌కు ప్రధాన సరఫరాదారులైన ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈల నుంచి చమురు రవాణాకు ఆటంకం కలగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది భారత ఎగుమతులపై కూడా సమయం, వ్యయాల పరంగా ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. గతంలో ఈ కీలక మార్గాన్ని అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించిన సందర్భాలున్నాయి. అయితే, ఒపెక్ ప్లస్ దేశాలు జూలైలో ఊహించిన దానికంటే అధిక ఉత్పత్తి పెంపును ప్రకటించడంతో, ప్రాథమికంగా చమురు మార్కెట్లు బాగానే సరఫరా అవుతున్నాయని, ఇరాన్ సరఫరా కోతలను కూడా సర్దుబాటు చేయవచ్చని ఎంకే గ్లోబల్ అనే ఆర్థిక సేవల సంస్థ నివేదిక పేర్కొంది. ప్రస్తుతానికి, మార్కెట్లు అప్రమత్తంగా ఉన్నాయి.

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానాలకు

# డీజీసీఏ ఆదేశాలతో భద్రతా తనిఖీలు

ఢిల్లీ: పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసిన ఆదేశాల మేరకు తమ సంస్థకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు ప్రత్యేక భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎయిరిండియా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. తమ ఫ్లీట్‌లోని బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో ఇప్పటికే తొమ్మిదింటికి భద్రతా తనిఖీలు పూర్తయ్యాయని వెల్లడించింది. మిగిలిన 24 డ్రీమ్‌లైనర్ విమానాలకు కూడా నిర్దేశిత గడువులోగా ఈ తనిఖీలను పూర్తి చేస్తామని సంస్థ స్పష్టం చేసింది. "డీజీసీఏ ఆదేశాలకు అనుగుణంగా వన్ టైమ్ భద్రతా తనిఖీలను కొనసాగిస్తున్నాం. బోయింగ్ 787 విమానాలు భారతదేశానికి తిరిగి వచ్చిన వెంటనే ఈ తనిఖీలు చేపడుతున్నాం" అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా వద్ద 26 బోయింగ్ 787-8 విమానాలు, 7 బోయింగ్ 787-9 విమానాలు సేవలు అందిస్తున్నాయి. ఈ విమానాలకు సంబంధించి వివిధ వ్యవస్థల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలని, ముఖ్యంగా విమానం టేకాఫ్ అంశానికి సంబంధించిన సాంకేతిక పరామితులను తనిఖీ చేయాలని డీజీసీఏ తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

ప్రయాణికులపై ప్రభావం, సూచనలు

కొన్ని విమానాలకు సంబంధించిన తనిఖీ ప్రక్రియకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని, దీనివల్ల ముఖ్యంగా సుదూర ప్రయాణ మార్గాల్లో నడిచే విమాన సర్వీసుల్లో కొంత ఆలస్యం జరగవచ్చని ఎయిరిండియా తెలిపింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. "ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన సర్వీసు స్టేటస్‌ను ఒకసారి తనిఖీ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని ఎయిరిండియా తమ ప్రకటనలో కోరింది.

## గాజాలో అలా జరుగుతుంటే..

# మోదీ సర్కారు ఇలా ప్రవర్తిస్తే ఎలా?

ఢిల్లీ: గాజాలో పౌరుల రక్షణ- చట్టపరమైన, మానవతా బాధ్యతలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చే ఐక్యరాజ్యసమితి తీర్మానానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దూరంగా ఉండటంపై వయనాడ్ నుండి కాంగ్రెస్ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం తీవ్రంగా విమర్శించారు. గాజా వివాదంలో ఇరు పక్షాలను దగ్గరకు తీసుకురావడంపై ప్రయత్నాలు దృష్టి పెట్టాలని ఇజ్రాయెల్‌ను విమర్శిస్తూ జనరల్ అసెంబ్లీ తీర్మానానికి భారతదేశం మళ్ళీ దూరంగా ఉంది. గురువారం జరిగిన తీర్మానానికి దూరంగా ఉన్న 19 దేశాలలో భారతదేశం ఒకటి. 149 ఓట్లు, అమెరికాతో సహా 12 వ్యతిరేకంగా ఓటు వేశాయి. ఈ చర్యను "సిగ్గుచేటు మరియు నిరాశపరిచేది" అని ప్రియాంక ఎక్స్‌లో పోస్ట్ చేశారు 60వేల మంది, ఎక్కువగా మహిళలు, పిల్లలు, ఇప్పటికే చంపబడ్డారు. మొత్తం జనాభా పరిమితం చేయబడి ఆకలితో చనిపోతున్నారు, ఈ నేపథ్యంలో భారతదేశం గైర్హాజరు కావడాన్ని ఆమె విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశం దీర్ఘకాల నైతిక దిక్సూచిని విడిచిపెట్టిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఒక దేశాన్ని మొత్తంగా నాశనం చేస్తుంటే మనం మౌనంగా నిలబడటమే కాకుండా, ఇరాన్‌పై దాడి చేసి, దాని సార్వభౌమత్వాన్ని, అన్ని అంతర్జాతీయ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ సైలెంట్‌గా వుండటం ఏంటని ప్రశ్నించారు. న్యాయం, అహింస మరియు రాజ్యాంగ సూత్రాల విలువలపై స్థాపించబడిన భారతదేశం, అటువంటి క్షణంలో ఎలా ఉదాసీనంగా ఉండగలదని ప్రియాంక ప్రశ్నించారు.

## కొత్త మంత్రులకు చాంబర్లు కేటాయింపు ఇలా..


హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో తమ తనఖా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి. వాకిటి శ్రీహరికి రెండో అంతస్తులోనే 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. ఇప్పుడు చాంబర్ల కేటాయింపుతో వీరు త్వరలోనే తమ శాఖల అధికారిక బాధ్యతలను స్వీకరించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వారికి శాఖల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి సామాజిక రంగాలకు సంబంధించిన కీలక శాఖలు అప్పగించగా, వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ వంటి పారిశ్రామిక రంగాల శాఖలు లభించాయి. వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరికి కేటాయించిన కొత్త కార్యాలయాలు త్వరలో బిజీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మంత్రులతో కార్యాలయాల్లో కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది.

## ప్రపంచ టాప్-20 కుబేరుల జాబితాలో మనవాళ్లు

ఢిల్లీ: ప్రపంచ కుబేరుల జాబితాలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మరోసారి సత్తా చాటారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాలో టాప్ 20లో ముఖేష్ అంబానీ, ఆదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ ఆదానీలు స్థానాలు దక్కించుకోగా, టాప్ 100లో తొమ్మిది మంది భారతీయ వ్యాపార దిగ్గజాలు చోటు దక్కించుకున్నారు. ప్రతి ఏటా బ్లూమ్‌బర్గ్ ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాను తాజాగా విడుదల చేసింది. బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో భారతదేశం నుంచి ముఖేష్ అంబానీ (17వ స్థానం), గౌతమ్ ఆదానీ (20), శివనాడార్ (41), షాపూర్ మిస్త్రీ (52), సావిత్రి జిందాల్ (59), అజీమ్ ప్రేమ్ జీ (69), సునీల్ మిట్టల్ (73), దిలీప్ సంఘ్వీ (79), లక్ష్మీ మిట్టల్ (86వ స్థానం)లు వంద స్థానాల్లోపు ఉన్నారు.

## కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం

# దురదృష్టకరం: పవన్ కల్యాణ్



అమరావతి: శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు. ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం అని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. "ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలి" అని పవన్ స్పష్టం చేశారు.

## ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి

# విదేశీ పర్యటనకు వెళుతున్న ప్రధాని మోదీ



జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన నూతనోత్సాహంతో ప్రధాని చేపడుతున్న ఈ యాత్ర, అంతర్జాతీయంగా భారత్ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది.

సైప్రస్ పర్యటన

పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత జూన్ 15, 16 తేదీలలో సైప్రస్‌లో ఉంటారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఖరారైంది. విశేషమేమిటంటే, రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. నికోసియాలో అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతారు. అనంతరం లిమాసోల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ భేటీలు మధ్యధరా ప్రాంతం మరియు యూరోపియన్ యూనియన్‌తో భారతదేశపు వ్యూహాత్మక బంధాలను కొత్త శిఖరాలకు చేర్చుతాయని ఆశిస్తున్నారు.

కెనడాలో జీ-7 సదస్సు

ఆ తర్వాత, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కాననాస్కిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రధాని మోదీ జీ-7 సదస్సులో పాలుపంచుకోవడం ఇది వరుసగా ఆరోసారి కావడం గమనార్హం. ఈ వేదికపై ఇంధన భద్రత, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)-ఇంధన రంగాల అనుసంధానం, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకుంటారు. పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు.

### చారిత్రక క్రొయేషియా పర్యటన

ఈ విదేశీ పర్యటన చివరి అంకంలో, జూన్ 18న ప్రధాని మోదీ క్రొయేషియాను సందర్శిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెన్కోవిక్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. ఒక భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే ప్రప్రథమం కావడంతో దీనికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. భారత్-క్రొయేషియా సంబంధాలలో ఇదొక సువర్ణాధ్యాయమని విదేశీ వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ఈ పర్యటన ద్వారా యూరోపియన్ యూనియన్‌లోని ముఖ్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత పటిష్ఠం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు




హైదరాబాద్: కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

కేంద్రం తీరుపై విమర్శలు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం లతో భేటీ కానున్న టాలీవుడ్ ప్రముఖులు !

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు నేడు (జూన్ 15, ఆదివారం) సాయంత్రం 4 గంటలకు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి సినీ పరిశ్రమకు చెందిన 35 నుంచి 40 మంది ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. సమావేశానికి ముందు వారు మొదట రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని కలవనున్నారు. అనంతరం ఆయనతో కలిసి సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లి చర్చల్లో పాల్గొననున్నారు. ఈ భేటీలో ఏపీ చిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలు చర్చకు రానున్నట్టు తెలిస్తోంది. గత కొంతకాలంగా సినీ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య పర్సంటేజీ వ్యవహారంపై చర్చలు నడుస్తున్నాయి. అద్దెల రూపంలో మూవీలను ప్రదర్శించడం సాధ్యం కావడం లేదని ఎగ్జిబిటర్లు అంటుంటే.. పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే సినిమా థియేటర్ల బంద్ కు పిలుపునివ్వడం.. ఆ తర్వాత బంద్ నిర్ణయాన్ని వాయిదా వేయడం జరిగాయి. థియేటర్ల బంద్ అంశంపై పవన్ కళ్యాణ్ ఇప్పటికే తీవ్రంగా స్పందించారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా సీఎం చంద్రబాబుని కలిశారా?" అని సినీ ప్రముఖులను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే పవన్ సినిమాకి కావాలనే అడ్డంకులు సృష్టించడం కోసం ఆ నలుగురు అలా ప్లాన్ చేశారని కూడా టాలీవుడ్ లో గుసగుసలు వినిపించాయి. పలువురు నిర్మాతలు సైతం ఆ నలుగురం మేము కాదంటూ ఓపెన్ గానే స్టేట్ మెంట్స్ ఇచ్చారు. తర్వాత ముఖ్యంగా థియేటర్ల పరిస్థితి, మౌలిక సదుపాయాలపై ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖ ఆదేశాల మేరకు అధికారులు పలు థియేటర్లలో తనిఖీలు చేపట్టారు. ఈ పరిస్థితుల్లోనే ఏపీలో చిత్ర పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య సహకారం పెంపొందించేందుకు ఈ సమావేశం కీలకం కానుంది. సీఎం సూచన మేరకు మంత్రి కందుల దుర్గేష్ సినీ ప్రముఖులకు ఆహ్వానం పంపారు. సమావేశం అనంతరం ఆయన ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక ఈ సమావేశానికి హాజరయ్యే వారిలో దర్శకులు బోయపాటి శ్రీనివాస్, త్రివిక్రమ్ శ్రీనివాస్, ఎస్.ఎస్. రాజమౌళి, నాగ అశ్విన్‌లు ఉంటారని సమాచారం. అలానే నిర్మాతల్లో అశ్వినీదత్, దిల్‌రాజు, అల్లు అరవింద్, డివివి దానయ్య, కేవీ రామారావు హాజరు కానున్నారు. నటుల్లో నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్, మంచు మనోజ్, ఆర్.నారాయణమూర్తి, సీనియర్ నటుడు సుమన్, నేచురల్ స్టార్ నాని ఉంటారని భావిస్తున్నారు. అలానే ఇంకా పలువురు ప్రముఖులు సమావేశంలో పాల్గొననున్నట్టు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిలో పలువురు సినిమా థియేటర్ వ్యాపారంలోనూ ఉన్న కారణంగా, థియేటర్ సమస్యలపై చర్చలు మరింత బలంగా జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

## కేసీఆర్‌కు రెండో రోజూ ఏఐజీలో వైద్య పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

సాధారణ ఆరోగ్య తనిఖీలలో భాగంగా ఆయన వరుసగా రెండో రోజు ఆసుపత్రికి వెళ్లడం గమనార్హం. కేసీఆర్ నిన్న మధ్యాహ్నం కూడా ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏఐజీ ఆసుపత్రికి వెళ్ళిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన కేసీఆర్, దాదాపు గంటసేపు అక్కడే ఉన్నారు. ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్, ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్‌కు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారని సమాచారం.

## రైతులను రౌడీలుగా చూపిస్తూ..

# చంద్రబాబుపై వైఎస్ జగన్ ఫైర్

హైదరాబాద్: రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడి చేయించారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ ట్వీట్ చేశారు. పొగాకు పంటకు కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని పొదిలిలో రైతులను పరామర్శించి భరోసా చెప్పేందుకే తాను అక్కడికి వెళ్లానని జగన్ తెలిపారు. తన పర్యటనకు సంఘీభావంగా దాదాపు 40 వేల మంది రైతులు, ప్రజలు తరలి వచ్చారని జగన్ తెలిపారు. అయితే, తాము వెళ్తున్న మార్గంలో 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారితో రాళు విసిరి గలాటా చేయించారని ఆరోపించారు. ఈ రాళ్ల దాడి వెనకున్న పన్నాగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు, రైతులు అత్యంత సంయమనంతో వ్యవహరించారని చెప్పారు. రాళ్ల దెబ్బలు తిన్న వైసీపీ కార్యకర్తలు, రైతులపైనే పోలీసు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా, తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది అంటూ జగన్ ట్వీట్ చేశారు. ఆ నలభై మంది టీడీపీ కార్యకర్తలపై అక్కడున్న 40 వేల మంది ప్రజలు తిరగబడి ఉంటే ఏం జరిగి ఉండేదని జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలి, అన్యాయాన్ని సరిదిద్దాలని కోరితే తానేదో విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆరోపించడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ఈ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు, గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డుతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యసాధ్యతల నివేదిక (పీఎఫ్ఆర్)కు కేంద్రం ఇంకా ఆమోదం తెలపకముందే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీపీఆర్ ఎలా అడుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పించకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలవకుండా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో కేంద్రాన్ని కోరారు.


## నా తండ్రి ఇలాగే మరణించారు.. వారి బాధను అర్థం చేసుకోగలను

అమరావతి: "నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ప్రభావ కుటుంబాల బాధ నాకు తెలుసు.. నేను అర్థం చేసుకోగలను" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై శనివారం ఆయన ఢిల్లీలో ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని, గుజరాత్ ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పనిచేశాయని తెలిపారు. "ఘటన జరిగిన వెంటనే మంటలను అదుపులోకి తెచ్చి, మృతదేహాలను తరలించాం. ఈ దుర్ఘటనపై తక్షణమే దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే ఈ కమిటీలో మరికొంత మంది సభ్యులను కూడా చేర్చుతాం" అని వివరించారు. శుక్రవారం సాయంత్రం ఘటనా స్థలంలో విమాన బ్లాక్‌బాక్స్ లభ్యమైందని, దానిని విశ్లేషించిన తర్వాత ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. "బ్లాక్ బాక్స్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. దర్యాప్తు ప్రక్రియ గురించి వివరిస్తూ, "హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశాం. ఇందులో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రత్యేక అధికారులు సభ్యులుగా ఉంటారు. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ దోహదపడుతుంది. నిపుణుల విచారణ పూర్తయిన తర్వాత, తగిన సమయంలో మీడియాకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని ఆశిస్తున్నాం. అంతేకాకుండా, బోయింగ్ 787 సిరీస్ విమానాలను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## గద్దర్ ఫౌండేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం చేయూత..

## రూ.3 కోట్లు మంజూరు

### సీఎం రేవంత్ రెడ్డి నిధుల కేటాయింపునకు ఆమోదం




హైదరాబాద్: ప్రముఖ విప్లవ కవి, వాగ్గేయకారుడు, దివంగత గద్దర్ సేవలను గౌరవిస్తూ ఆయన ఆశయాలను సజీవంగా ఉంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గద్దర్ ఫౌండేషన్‌కు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధుల కేటాయింపునకు ఇటీవలే ఆమోదముద్ర వేశారు. గద్దర్ భావజాలాన్ని పరిరక్షించడం, ఆయన ఆలోచనలు, సాంస్కృతిక ప్రభావంపై పరిశోధనలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నిధులను గద్దర్ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ముఖ్యంగా గద్దర్ స్ఫూర్తిని కొనసాగించే పరిశోధన కార్యక్రమాలు, ఆయన స్మారకార్థం చేపట్టే ప్రాజెక్టులు, గద్దర్ జయంతి వంటి కార్యక్రమాల నిర్వహణకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది. గద్దర్ రచించిన పాటలు, ఆయన చేసిన పోరాటాలు, అందించిన సృజనాత్మక సందేశాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయాలనేది ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, అణగారిన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన నిరంతర పోరాటానికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గద్దర్ తన జీవితాంతం కుల వివక్ష, సామాజిక అన్యాయాలపై తన గళాన్ని బలంగా వినిపించారు. తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక విభాగంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనది. తన పాటలు, ప్రసంగాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం రగిలించడంలో గద్దర్ ముందున్నారు. 2023 ఆగస్టులో ఆయన మరణం ఒక శకానికి ముగింపు పలికినప్పటికీ, గద్దర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గద్దర్ ఫౌండేషన్‌కు ఈ మూడు కోట్ల రూపాయల కేటాయింపు ద్వారా ఆయన ప్రబోధించిన సమానత్వం, న్యాయం, సాంస్కృతిక వైభవం వంటి విలువలను పరిరక్షించి, రాబోయే తరాలకు అందించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయంగా కనిపిస్తోంది.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



రామన్నపేట - ప్రభాత సూర్యుడు: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని స్థానిక బిఆర్ఎస్ నాయకులు గర్దాసు విక్రమ్



అన్నారు. రామన్నపేట మండలం ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన గర్దాస్ సత్తయ్య( పద్మశాలి) గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ గురువారం మరణించాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మృతుని కుటుంబ సభ్యులను గర్దాసు విక్రం పరామర్శించి, 5000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాస వెంకటేశం, గర్దాసు కరుణాకర్, రవ్వ నరసింహ, సింగన బోయిన దశరథ, సింగన బోయిన పగడాల మాంటి లింగస్వామి, మల్లేశం, వెంకటేశం సత్యనారాయణ, గొల్లపల్లి యాదయ్య, గర్దాసు, శ్రీకాంత్ మహేష్ , సాయి తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోవాలి

చిలుకూరు (ప్రభాత సూర్యుడు): కొత్త పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన రైతులు ఈ ఏడాది వానాకాలం రైతు భరోసా కు సోమవారం నుండి చిలుకూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 -6 -2025 నాటి వరకు కొత్త పట్టాదారు పుస్తకం పొందిన వారు మాత్రమే ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం ,బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో రైతు భరోసా వచ్చిన వాళ్ళు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆ ప్రకటనలో తెలిపారు.

## మొక్కల పెంపకం పేరుతో పోడు రైతులను మోసం చేయొద్దు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు.రఘు



ఏటూరు నాగారం (ప్రభాత సూర్యుడు): చిన్నబోయినపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్న పోడు భూముల సమస్యను కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చినాక తప్పకుండా పరిష్కారం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రఘు అన్నారు ఫారెస్ట్ ఉన్నదా అధికారుల సహాయంతో రైతులకు సంబంధించిన భూముల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం కూడా రైతులకు న్యాయం చేస్తుందని ఈ విషయాన్ని మంత్రి సీతక్క గారి చొరవతో పరిష్కారం మార్గాన్ని అధికారులు మంత్రి సీతక్క గారు చూపిస్తారని గ్రామస్తులు ఎలాంటి భయాందోళన గురికా వద్దని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మీద నమ్మకంతో సీతక్క గారు నమ్మకంతో ఆనందం చేయడం జరిగిందని ఉన్నారు ఇటువంటి పొరపాటు జరిగిన ముందుగా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతిని పోరాటం చేసుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు అన్నారు .

## సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

### సిపిఎం జెండా ఆవిష్కరించిన మండల రాములు

### ప్రిన్సిపల్ గా పి అంజయ్య

యాచారం :. యాచారం మండల పరిధిలో తమ్మలోని గూడ సమీపంలో శ్రీ సత్యనారాయణ ఫంక్షన్ హాల్ లో 14, 15 సిపిఎం పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. శనివారం సిపిఎం శిక్షణ తరగతులు పార్టీ సీనియర్ నాయకులు మండల రాములు జెండా ఆవిష్కరించారు. ఉదయం మొదటి క్లాసు సిపిఎం జిల్లా కార్యదర్శి పావురాల యాదయ్య రాజకీయ ముసాయిదా తీర్మానంపై క్లాసులు బోధించారు. మధ్యాహ్నం రెండో క్లాస్ మతం మతోన్మాదంపై పిట్టల రవి బోధించారు. రంగారెడ్డి జిల్లాలో బలమైన పార్టీ నిర్మాణం పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పైన నిరంతరం అధ్యాయం చేసి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మతం మత్తు లాంటిది, దేశ రాజకీయాల్లో మోడీ ప్రభంజనం మతం మత్తులో మునిగిపోయారని పార్టీ శిక్షణ తరగతులో బోధించారు. ఈ దేశానికి బిజెపి హానికరమని అన్నారు. ప్రజలను చైతన్యం చేసి, బిజెపి మతం చిచ్చుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అప్పుడే ప్రజల్లో చైతన్యమై మేల్కొంటారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య, చంద నాయక్, జంగయ్య, తావు నాయక్, దంతుక పెద్దయ్య, జగన్, పి వెంకటయ్య, ఎం జె వినోద్ కుమార్, నాజర్, విప్లవ కుమార్, బాలరాజ్, పద్మ, పార్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ మామగారైన క్రీ"శే" శ్రీ మద్దెల ప్రసాద్ గారి సంస్మరణ సభలో

కొండమల్లేపలి : దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ మామగారైన క్రీ"శే" శ్రీ మద్దెల ప్రసాద్ గారి సంస్మరణ సభలో పాల్గొన్న కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డి

## రామారావు గారి భౌతిక దేహానికి పీసీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి నివాళులర్పించారు

కొండమల్లేపల్లి జూన్ 14: దేవరకొండ ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది రామారావు మరణాన్ని చింతిస్తూ, హైదరాబాదులోని నాగోల్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పీసీసీ సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి గారు, దేవరకొండ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు గారు, నీలా హరిబాబు గారు రామారావు గారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామారావు గారి సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

## 11 సంవత్సరాలుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకొని నాయకుడు మోదీ

కొండమల్లేపల్లి జూన్ 14: అన్నదాతలకు అండగా నరేంద్ర మోదీ ప్రభుత్వం రక్షణ వ్యవస్థ కట్టుదిట్టం చేయడంలో మోదీ ప్రభుత్వం సఫలం భూతరాజు భరత్ కుమార్ బిజెపి కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాని పదవి చేపట్టి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్ శనివారం వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకొని నాయకుడు మోదీ అని నిరంతరం దేశ అభివృద్ధికి పాటు పడుతున్న వ్యక్తి అని అన్నారు. అన్నదాతలకు అండగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దు, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు, ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలు నరేంద్ర మోదీ సొంతం అని అన్నారు. రక్షణ వ్యవస్థ కట్టుదిట్టం చేయడంలో మోదీ ప్రభుత్వం సఫలం అయ్యిందనీ అన్నారు.విమాన ప్రమాద మృతులకు నివాళి

# శ్రీ కాళహస్తి దేవస్థానంలో పనిచేస్తున్న ఉచిత సేవకులకు న్యాయం చేయండి ఆదుకోండి

### మాకు న్యాయం జరిగే వరకు పోరాడుతామ్

### నాయకులకు వినతి పత్రాలు అందజేస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం ఉచిత సేవకులు

న్యూస్ స్టేట్ బ్యూరో చీఫ్ అమరావతి : పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ



కాళహస్తి దేవస్థానం లో ఉచిత సేవకులు గా పనిచేస్తున్న మాకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు నాయకులు ప్రముఖులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు . మాకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని మాకు జీవనాధారమైన వృత్తిలో వేరే వారిని నియమించడం దారుణం అని మాకు న్యాయం చేయాలని లేని పక్షంలో మాకు మరణమే శరణ్యమని ఉచిత సేవకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా సేవలను గుర్తించి



అప్పటి ఆలయ కమిటీ ఛైర్మెన్ అంజూరు శ్రీనివాసులు మాకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకొన్నారని దాన్ని జీర్ణించుకోలేని నాయకులు కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా మాకు అన్యాయం చేసి మా స్థానంలో వేరే వారిని నియమించారని ఆరోపించారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని పలువురు నాయకులు ప్రముఖులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తిరుపతి ఎంపీ , మాజి ఎమ్మెల్యే లను అన్ని పార్టీల నాయకులు ప్రముఖులను అధికారులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ వినతి పత్రాలు అందజేశారు . 2014 నుంచి మేము శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం నందు జరిగే శ్రీ స్వామి -అమ్మవార్ల ఉత్తవర్ల ఊరేగింపులు, గొడుగులు, దివిటీలు, సూరిటీలను మోస్తూ సేవ చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో ట్రస్టుబోర్డు ఛైర్మెన్ శ్రీ అంజూరు శ్రీనివాసులు గారిని వారి సభ్యులను కలసి విన్నవించుకుని జీతభత్యాలు ఏర్పాటుచేయమని కోరగా అందుకు సమ్మతించి ట్రస్టుబోర్డు సమావేశంలో మా అంశాన్ని పొందుపరచి సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానంలో జీతభత్యాలు యిచ్చేందుకు దేవాదాయశాఖ కమీషనర్ అనుమతికి పంపడం జరిగింది. కమీషనర్ అనుమతి యివ్వడం, జీతభత్యాలు దక్షిణామూర్తి ఏజెన్సీ ద్వారా యిచ్చేందుకు అనుమతి యివ్వడం జరిగింది.ఈవిధంగా ఎన్నో సంవత్సరాలు ఉచితంగా పనిచేసిన మాకు జీతాలు వస్తే, యిప్పుడు మా ఆర్డర్ (అనుమతి) కాపీ ద్వారా మా పేర్లు కాకుండా కొత్తవారిని చేర్చి అన్యాయంగా మమ్మల్ని ప్రక్కన పెట్టేస్తుంటే మేమందరం కలసి కోర్టును ఆశ్రయించడం జరిగింది. కోర్టువారు దేవస్థానం అధికారులను కోర్టుకు పిలిపించగాకార్యనిర్వహణాధికారి వారు ఖచ్చితంగా వీరికి జీతాలు యిస్తామని నమ్మపలికారు. కానీ కోర్టును, న్యాయాధికారుల మాటలను భేఖాతరు చేస్తూ, క్రొత్తవారికి డ్యూటీలు యిస్తున్నారు. కావున మీరు మాకు సంపూర్ణ సహకారం అందించి మా పోరాటానికి సంఘీభావం పలికి నిరుపేదలమయిన మాకు మా ఉద్యోగాలను కాపాడడంలో మాకు అండగా ఉండాలని ప్రముఖులను నాయకులను అధికారులను కోరారు . దేవాలయంలో భగవంతుడిని నమ్ముకొని బతుకుతున్న మాకు న్యాయం చేయాలని లేని పక్షంలో మాకు మరణమే శరణ్యమని తెలియజేశారు. దీనిపై ఇప్పటికే పలువురిని ప్రాదేయపడ్డామని వేడుకొన్నారు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలని లేని పక్షంలో మాకు మరణమే శరణ్యమని ఉచిత సేవకులు తెలియ జేశారు.

# మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది....

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



పగల: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలం దామలచెరువలో శనివారం మామిడి రైతులు,వ్యాపారస్తులతో కలిసి సమీక్ష కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించారు.కార్యక్రమానికి చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు,చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని,పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్,చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ విచ్చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సబ్సిడీ రూపంలో 168 కోట్ల రూపాయలు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల శాఖ మంత్రివర్యులు అచ్చం నాయుడు తెలిపారు.మంత్రివర్యులు మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకోవడానికి తెలుగు దేశ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆలోచనతో మామిడి రైతులను ఆదుకోవడానికి ఈరోజు కంపెనీలతో చర్చించి ఒక ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు వివిధ కంపెనీలు 8 రూపాయలకే కేజీ మామిడి పండ్లు ధర నిర్ణయించడం జరిగిందని 4 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.రైతుల స్వేచ్ఛగా వారు పండించిన మామిడి పంటను,మండిళ్లలో



గాని,మార్కెట్లో గాని అమ్ముకోవచ్చునని తెలిపారు,సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు చివరి కాయ వరకు విక్రయించుకోవచ్చునని.2019వ సంవత్సరంలో జిల్లాలో మామిడి ధర తెలుగుదేశం ప్రభుత్వమే 7.50 పైసలకు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు నాణ్యమైన మామిడికాయలను కంపెనీలకు సరఫరా చేయాలని ఆదేశించారు.మామిడి రైతులకు 168 కోట్ల రూపాయల సబ్సిడీ రూపంలో అందజేస్తున్నామని మంత్రివర్యులు తెలిపారు.రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయుచున్నాడని తెలిపారు.రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద మామిడికాయలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.ప్రస్తుతం 22 మెట్రిక్ టన్నులు మామిడికాయలను కొనడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం చేస్తామని,మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఫ్యాక్టరీ యజమానులు మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో సహకారం అందించండని చెప్పారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4 లక్షల కుటుంబాలు మామిడి పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.రైతులందరికీ చంద్రబాబు నాయుడు అండగా ఉంటారు అని తెలియజేశారు.రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని తెలపడానికి ఇదొక నిదర్శనం.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గల మూడు ఫ్యాక్టరీల వల్ల రైతులు నష్టపోతున్నారు.ఫ్యాక్టరీలపై మంత్రివర్యులు తగిన చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు.కార్యక్రమంలో సంబంధిత అధికారులు,రైతులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట కట్టుబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

### తల్లికి వందనం పేద ప్రజలకువరం

### జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి

(స్వామి) గూడూరు : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలపరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కన్నారు. సూపర్ సెక్స్ లో భాగంగా విద్యార్థుల ఉన్నత కోసం కృషి చేసేందుకు ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమంది విద్యార్థులకు 15000 రూపాయలు తల్లికి వందనం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం జూన్ 12వ తేదీన ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15 వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారనీ విమర్శించడం సిగ్గుచేటు అన్నారు. రూ.2 వేలు లోకేష్ బాబు జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన వ్యవహారం అన్నారు. వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే రూ.2 వేలు మీ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలస్ కు చేరాలని పేర్కొన్నారు. వైసిపి పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారితల్లిదండ్రులను మీరు మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. “కేజి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తాను.. ఎంతవరకు చదవుకుంటే అంతవరకు చదివిస్తాను.. మేనమామగా చెబుతున్నాను” అని మాటలు చెప్పి బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన 12 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసింది మీరు కాదా అని గుర్తు చేశారు. 2019 ఎన్నికల ప్రచారంలో “మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఇస్తాము” అంటూ ప్రచారం చేసి మోసం చేయలేదా అని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబంలో ఒక్క విద్యార్థికే రూ.13వేలు ఇస్తామంటూ నాలుక మడతబెట్టారన్నారు. 18,55,760 మంది తల్లులకు ఒక్కరే సంతానం. ఆ బిడ్డనే తన ప్రపంచంగా, తన ఆశలకు నిలువుటద్దంగా భావించేవారు ఆ తల్లులు. ?13,000 జమ అయ్యింది అని సందేశం వచ్చినప్పుడు, ఆ తల్లి కళ్లలో మెరిసే మెరుపు, తన బిడ్డ చదువుకు, భవిష్యత్తుకు వేసిన తొలి అడుగుగా భావిస్తుంది. ఆ లక్షలాది తల్లుల కళ్ళల్లో ఆనందాన్ని, గుండెల్లో భారాన్ని దింపి భరోసాను నింపుతోందన్నారు. 14,55,322 మంది తల్లులకు ఇద్దరేసి బిడ్డలు. అంటే 29,10,644 మంది చిన్నారులు. ఇద్దరు పిల్లలను పెంచడం, వారి అవసరాలు తీర్చడం ఎంత కష్టమో ఆ తల్లులకే తెలుసు. ?26,000 డబ్బు జమ అయినప్పుడు, “కష్టాలు తీరాయి, ఇద్దరినీ బాగా చూసుకోగలను” అనే తృప్తి వారి ముఖాల్లో స్పష్టంగా



కనిపిస్తోందనీ తెలిపారు. 2,10,684 మంది తల్లులకు ముగ్గురు పిల్లలు (మొత్తం 6,32,052 మంది పిల్లలు), అలాగే 20,053 మంది తల్లులకు నలుగురు పిల్లలు (మొత్తం 80,212 మంది పిల్లలు) ఉన్నారు. ఇంత మంది పిల్లలను పెంచే తల్లులు పడే కష్టం వర్ణనాతీతం. ఇంట్లో ఎక్కువ మంది బిడ్డలుంటే అంత మందికి తల్లులకు వందనం చెప్పాలి. వారి కష్టం, త్యాగం గొప్పవి. వారికి ?39,,000/-, ?52,000/- బ్యాంకు ఖాతాలో జమ అయినప్పుడు, అది వారికి కేవలం డబ్బుగా కనిపించదు. అది వారి కన్నీళ్లను తుడిచే వరదహస్తంగా.. పిల్లలు పస్తులు వుండకుండా, వారి చదువులు ఆగిపోకుండా చూసుకోగలుగుతాం అని కలిగే ఊరట వెలకట్టలేనిది అన్నారు. తల్లికి వందనం అనేది డబ్బుగా కన్నా.. వారి కళ్ళల్లో కనిపించే ఆనందం, గుండెల్లో నిండిన ప్రేమ, భవిష్యత్తుపై వారికి కలిగే నమ్మకం, మన మనసుతో చూస్తే మనకూ ఓ తృప్తి. ఇది లక్షలాది కుటుంబాల్లో వెలిగించిన ఆశల దీపం. ఈ క్రెడిట్ మెసేజ్‌లు కేవలం బ్యాంక్ లావాదేవీలు కావు. తల్లుల ముఖాల్లో కనిపించే ఆ ప్రశాంతతే, ఈ పథకం విజయాన్ని చాటుతోంది. సంతానం ఇక భారం కాదు అని అందరూ గర్వంగా చూస్తుంటే.. సంతోషాన్ని ఇచ్చే రోజులు చంద్రబాబు నాయుడు, ఆయన బిడ్డ మనకోసం తెచ్చారు అనే భావన తల్లుల్లో కలుగుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనంపై విమర్శలు మాని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

# విమాన ప్రమాద మృతులకు నివాళి

### విమాన ప్రమాద ఘటన బాధాకరం...

### రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు



: అహ్మదా బాద్ నుండి లండన్ వెళ్తున్న విమాన దుర్ఘటనలో అనేక మంది మరణించడం చాలా బాధాకరమని రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు అన్నారు.ఈ సందర్భంగా విమాన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని లింగాపూర్ గ్రామం లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి



ప్రమాద మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపారపు సత్య రాజ్ మాట్లాడుతూ ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని విమాన ప్రమాదంలో ఆ రాష్ట్ర మాజీ సీ ఎం విజయ్ రూపానితో పాటు వందల మంది ప్రయాణికులు, మెడికల్ కళశాల విద్యార్థులు మృతి చెందిడం విచారకరమన్నారు. అలాగే ఈ దుర్ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, అలాగే వారికి నాణ్యమైన వైద్యం టాటా గ్రూప్ యాజమాన్యం అందించి పూర్తిగా ఆదుకోవాలని గుజరాత్ ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని అన్నారు.అనంతరం ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు కార్యక్రమంలో గ్రామ యువకులు గణేష్, రాహుల్, విజయ్, సునీల్,అనిల్,రాజ్ కుమార్, పవన్ తదితరులు ఉన్నారు

## త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోడి భేటీ



న్యూఢిల్లీ : పాకిస్తాన్ తో ఉద్రిక్తతలు నేపథ్యంలో మరోసారి శనివారం ప్రధాని నరేంద్ర మోడి హైలెవల్ డిఫెన్స్ మీటింగ్ (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ మాజీ చీఫ్ లతో) అయ్యారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్ నాథ్, ఎన్ఎస్ఏ దోవల్ హాజరయ్యారు. త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని చర్చ కొనసాగుతోంది. శుక్రవారం ఢిల్లీలో ప్రధాని అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి పాల్గొన్నారు. సరిహద్దు లో నెలకొన్న తాజా పరిస్థితి, పాక్ విషయంలో చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించినట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధిపతులు, ఆర్మీ, నేవీ, వాయుసేన టాప్ రిటైర్డ్ ఆఫీసర్లతోనూ మోడి భేటీ అయ్యారు. సైన్యంలో వారికి ఉన్న అపార అనుభవం ఆధారంగా తాజా పరిస్థితిని ఎదుర్కోవడంపై వారి సూచనలు, సలహాలను ప్రధాని తీసుకున్నారు.

## మిస్ వరల్డ్ పోటీలు వాయిదా వేయలేం : ఎంపీ చామల




మిస్ వరల్డ్ కాంపిటీషన్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన కామెంట్స్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను ఎమ్మెల్సీ కవిత దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతీ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని అన్నారు. రాజకీయంలో ఉన్నాం కదా అని ఏదో ఒకటి మాట్లాడాలి అన్న ఆలోచన ఆమోదమన్నారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ లను పోస్ట్ ఫోన్ చేయడం లేదా రద్దు చేయడం లాంటి కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వానికి చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమేనని.. తెలంగాణ రాష్ట్రం నేడు చాలా సేపెస్ట్ ప్లేస్ అని తెలంగాణలో పెట్టుబడులు పెట్టవచ్చని తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్లు ప్రపంచ వ్యాప్తంగా చూసే ఈవెంట్లను చేయవచ్చని తెలిపారు. ఒక 4, 5 నెలల క్రితం ఈ ప్లేస్ తెలంగాణను సెలెక్ట్ చేశారని తెలిపారు. తెలంగాణ మీద నమ్మకంతో ఇక్కడ ఈవెంట్ పెట్టుకున్నారని అన్నారు.

## ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది




పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారతదేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్.. ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి పాక్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశఆరు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. భారత్‌ను మతప్రాతిపదికన విభజించాలని పాక్ ప్రయత్నిస్తోందని అన్నారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉంటున్నారని.. హిందూ, ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మా పూర్వీకులు తిరస్కరించారని ఓవైసీ అన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాకిస్థాన్.. ఆఫ్ఘానిస్థాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని, ఇరాన్ సరిహద్దుల్లో ఎందుకు బాంబులు వేస్తోందని, ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా? ఆయన ప్రశ్నించారు.

## శ్రీనగర్, ఉధంపూర్ లోని ఆస్పత్రులపై పాక్ దాడులు చేస్తోంది: సోఫియా ఖురేషి



ఢిల్లీ: శ్రీనగర్, ఉధంపూర్ లోని ఆస్పత్రులపై పాకిస్థాన్ దాడులు చేస్తోందని కల్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాక్-భారత్ సరిహద్దుల కాల్పుల మోత మోగుతుండడంతో ఆమె మీడియాతో మాట్లాడారు. పాక్ ఆర్మీ నిరంతరంగా పశ్చిమ సరిహద్దుల్లో దాడులు చేస్తోందని, పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఎయిర్‌లాంచర్లను ధ్వంసం చేశామని, పాకిస్థాన్ డ్రోన్లు, లాంగ్‌రేంజ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో దాడులు చేస్తోందని కల్నల్ వివరించారు. భారత్‌లోని 26 ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లతో దాడి చేసిందని, అర్ధరాత్రి 1.40 గంటల తరువాత పాకిస్థాన్ దాడులు తీవ్రతరం చేసిందని, శ్రీనగర్, ఉధంపూర్, బటిండా, భుజ్‌లో దాడులకు పాల్పడుతోందని సోఫియా ఖురేషి పేర్కొన్నారు. పలుచోట్ల పాఠశాలలు, వాయుసేన ఆస్పత్రులపై కూడా దాడులు చేస్తోందని, శ్రీనగర్ నుంచి నలియా వరకు పాక్ భారీ దాడులకు పాల్పడుతోందని, భుజ్, బటిండాలోని ఎయిర్‌స్టేషన్లపై పాక్ దాడి చేసిందని, పంజాబ్‌లోని ఎయిర్‌బేస్‌లను పాక్ లక్ష్యంగా చేసుకుందని, పాక్ ప్రయోగించిన డ్రోన్లు టర్కీకి చెందినవిగా గుర్తించామన్నారు.

## ఎపిలో కొత్త విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నాం



అమరావతి: 'కనెక్టెడ్ ఆంధ్రప్రదేశ్' కలను ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చేందుకు కొత్త విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..విజయవాడ నుంచి బెంగళూరుకు జూన్ 2 నుంచి ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ విమానాలు నడుస్తాయని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం నుంచి బెంగళూరుకు సులువుగా చేరుకోవచ్చునని, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. విమాన సర్వీసులు జూన్ 13 నుండి ప్రారంభమవుతాయని.. ఈ విమానాలు వారానికి నాలుగురోజులు నడుస్తాయని అన్నారు. యూఎఈ, ఇతర దేశాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# సముచిత నిర్ణయాలు



స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగి నవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు. అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ,సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంత ర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రా యాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మందిఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్య సభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశా బ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017-2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు. తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్థాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యా యన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయ మూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యో గులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14-15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షితంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు. నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి. ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సేవుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటంప్రశంసనీయమైన పరిణామం.

# పండ్లు వృథాగా పోకుండా.. ఆస్మోటిక్ డీ హైడ్రేషన్ బెస్ట్

## ఆస్మోటిక్ డీ హైడ్రేషన్ బెస్ట్

బొప్పాయి, జామ, ఉసిరి వంటి పండ్లకు మార్కెట్ డిమాండ్ తక్కువగా ఉన్నప్పుడు తెగనమ్ముకోకుండా లేదా వృథాగా పారేయకుండా వాటిని ఎండ బెట్టి నిల్వ ఉండే వివిధ ఉత్పత్తులుగా మార్చితే రైతులకు మంచి అదనపు ఆదాయం చేకూరుతుంది. ఎండబెట్టే క్రమంలో ఆస్మోటిక్ డీహైడ్రేషన్ ప్రక్రియ మేలైనదని, తద్వారా అనేక విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసు కోవచ్చని బెంగళూరులోని భారతీయ ఉద్యాన పంటల పరిశోధనా స్థానం (ఐఐహెచ్ఆర్) చెబుతోంది.



### బొప్పాయి ఫ్రూట్ బార్ తయారీ విధానం

బొప్పాయి మన దేశంలో ఒక ముఖ్యమైన పంట. అద్భుతమైన వాసన, రుచి, విటమిన్ ఎ, సిలకు ఇది పెట్టింది పేరు. బొప్పాయికి మార్కెట్‌లో గిరాకీ లేనప్పుడు దూర ప్రాంతాలకు ఖర్చులు భరించి రవాణా చేయటం కష్టం. అందువల్ల కోత అనంతర నష్టం బొప్పాయిలో చాలా ఎక్కువ. కొన్నిసార్లు చిన్న కాయలు లేదా బాగా పెద్ద కాయలను మార్కెట్‌లో అమ్మటం కష్టమవుతుంది. అటువంటప్పుడు రైతులు బొప్పాయి ఫ్రూట్ బార్ (బొప్పాయి తాండ్ర)ను తయారు చేసి అమ్ముకోవచ్చు. ఫ్రూట్ బార్‌లు పోషకవంతమైనవి. చూపులకు నచ్చుతాయి. రుచిగా ఉంటాయి. రవాణా చేయటం సులభం. ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. అయితే, బొప్పాయి గుజ్జుతో తాండ్రను తయారు చేయటం మామిడి అంత తేలిక కాదు. దీన్ని తయారు చేసే క్రమంలో పగుళ్లు వస్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు ఒక ప్రాసెస్‌ను కనిపెట్టారు. నీటి శాతం తగ్గించి, తాండ్రగా మార్చడానికి ఇది ఉపయోగపడుతుంది. బొప్పాయి ఫ్రూట్ బార్ చక్కటి తాజా పండు మాదిరిగానే వాసన వస్తుంది. రూపం, రుచి కూడా బాగుంటాయి. దీన్ని చిరుతిండిగా తినొచ్చు. పిల్లలకు, పర్వతారోహకులకు, రక్షణ సిబ్బంది, సైనికులకు ఇది ఉపయోగకరం. ఈ డీహైడ్రేటెడ్ ప్రొడక్ట్‌ను చిన్న, సన్నకారు పరిశ్రమలతో పాటు మధ్యతరహా పరిశ్రమల్లోనూ తయారు చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా ప్రాసెసింగ్ యూనిట్లకు ఉపయోగపడేలా ఈ సాంకేతికతను రూపొందించినట్లు ఐఐహెచ్ఆర్ పేర్కొంది. కిలో ఫ్రూట్ బార్ తయారు చేయడానికి 7-8 కిలోల బొ?్పయి కాయలు అవసర మవుతాయి. ఇది సాధారణ పరిస్థితుల్లో ఆరు నెలలు నిల్వ ఉంటుంది.

### జామ ముక్కల వొరుగుల తయారీ టెక్నాలజీ

జామ పండ్లలో గుజ్జు ఎక్కువ నీటితో కూడి తియ్యగా ఉంటుంది కాబట్టి తాజా పండ్లు తినటమే బాగుంటుంది. జామ పండు చక్కటి సువానతో పాటు విటమిన్ సిని కలిగి ఉంటుంది. అయితే, పండు చాలా త్వరగా పాడైపోతుంది. కాబట్టి, ప్రాసెస్ చేస్తే మంచి లాభదాయకం. జెల్లీ, జ్యూస్, ఫ్రూట్ బార్ వంటి ఉత్పత్తులను జామపండుతో తయారు చేయటం మనకు తెలుసు. అయితే, ఆస్మోటిక్ డైహైడ్రేసన్ పద్ధతిలో తొలుత నీటి శాతాన్ని తగ్గిస్తే.. పూర్తిస్థాయి ప్రాసెసింగ్, ఎయిర్ డ్రయ్యింగ్ చప్పున పూర్తవుతుంది. ఈ సాంకేతికత ద్వారా తెలుపు, గులాబీ రంగు గుజ్జు ఉండే జామ పండ్ల ముక్కలను డీహై డ్రేట్ చెయ్యొచ్చు. ఆస్మో-ఎయిర్ డ్రైడ్ ఫ్రూట్స్‌ను ఉత్పత్తి చేసే ప్రక్రియ చాలా వినూత్నమైన పద్ధతి. జామ ముక్కలకు తొలుత పంచదార ?కం కలపటం ఆస్మోటిక్ డీహై డ్రేషన్‌లో తొలి దశ. ఆ తర్వాత పాక్షికంగా నీరు తగ్గిన ముక్కలను హాట్ ఎయిర్ డ్రయ్యర్ ద్వారా తేమ శాతాన్ని 15% కన్నా తక్కువ తేమ ఉండేలా తయారు చేయాలి. ఇలా తయారైన జామ ఎండు ముక్కలను చిరుతిండిగా తినొచ్చు. లేదా ఇతర డ్రైఫ్రూట్స్‌తో కలిపి తినొచ్చు. దీన్ని ఐస్‌క్రీమ్ పరిశ్రమలో, ఫ్రూట్ సలాడ్లలో, ఖీర్‌లో, కేకులు, బేకరీ ఉత్పత్తుల్లో ఉపయోగించవచ్చు. పిల్లలకు, బరువైన వస్తువులు తీసుకెళ్లలేని పర్వతారోహకులకు, సైనికులకు ఎక్కువ ఉపయోగకరం. ఈ ప్రాసెస్ చాలా సులభం. పెద్ద యంత్ర పరికరాలేమీ అక్కర్లేదు. దీన్ని చిన్నసన్నకారు ప్రాసెసర్లు, మహిళా సంఘాలు, ఇతర స్వయం ఉపాధి పొందే వర్గాల వారు ఈ పద్ధతిని ఉపయోగించుకోవచ్చు. కిలో ఆస్మో-ఎయిర్ డ్రైడ్ జామ ఒరుగులు తయారు చేయటానికి 7-8 కిలోల జామ పండ్లు కావాలి. 6 నెలల నుంచి ఏడాది వరకు నిల్వ ఉంటాయి.

### సహజ రంగుతో కూడిన వుసిరి ఒరుగులు

ఔషధ గుణాల పుట్ట అయిన ఉసిరికి ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంటుంది. అస్కార్బిక్ ఆసిడ్ అధిక పాళ్లలో కలిగిఉండటంతో పాటు యాంటీబయోటిక్, లాక్జేటివ్‌గా పనిచేసే గుణాలు దీనికి ఉన్నాయి. కోకుమ్ / మాంగోస్టీన్‌లో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి జీర్ణశక్తిని, ఆకలిని పెంచుతాయి. దీని రంగును ఉసిరి ఒరుగులకు పట్టిస్తే ఆకర్షణీయంగా ఉంటాయి. ఇటు ఉసిరి, అటు మాంగోస్టీన్‌లలో ఔషధ గుణాలు ఎక్కువే గానీ అవి త్వరగా పాడైపోతాయి. వీటిని నేరుగా పండ్లను తినటం కష్టం. ప్రాసెస్ చేయాల్సిందే. కోకుమ్ జ్యూస్‌ను తీసి వుసిరి తొనలకు కలిపితే.. వుసిరి ఒరుగులకు మంచి ఎరుపు రంగుతోపాటు సువాసన వస్తాయి. ఆస్మోటిక్ పద్ధతిలో ఎండబెట్టిన వుసిరి తక్కువ అసిడిక్‌గా ఉంటాయి. రుచి బాగుంటుంది. ఎర్రటి ఈ ఒరుగులను విడిగా చిరుతిండిగా తినొచ్చు లేదా ఇతర డ్రై ఫ్రూట్స్‌తో కలిపి తినొచ్చు. పిల్లలకు, పర్వతారోహకులకు, సైనికులకు ఇవి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. కోకుమ్ రంగు కలిపిన ఉత్పత్తులు మార్కెట్‌లో లేవు. చిన్న తరహా ప్రాసెసింగ్ సదుపాయాలున్న వారు వీటిని తయారు చేసుకోవచ్చు. ఆస్మోటిక్ పద్ధతిలో ఎండబెట్టిన ఉసిరి ఉత్పత్తులు తాజా పండ్ల మాదిరిగానే ఉంటాయి. 4-5 కిలోల ఉసిరి పండ్లు, 2 కిలోల కోకుమ్ పండ్లు కలిపి తయారు చేస్తే ఓస్మో-ఎయిర్ డ్రైడ్ స్లైసెస్ తయారవుతాయి. జాగ్రత్తగా నిల్వ చేస్తే ఒక ఏడాది పాటు నిల్వ ఉంటాయి.



# అవకాడో: పోషకాల పండు.. లాభాలు మెండు



విదేశీ పంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి జిల్లా ఆలవాలంగా మారింది. ఇప్పటికే ఏజెన్సీ పాంతంలో స్ట్రాబెర్రీ, లిచీ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు మంచి ఫలితాలను ఇస్తుండగా తాజాగా ఈ కోవలోకి అవకాడో వచ్చి చేరింది. కాఫీ చెట్లకు నీడ కోసం పెంచుతున్న ఈ చెట్లు పోషక విలువలతో ఉన్న పళ్లను కూడా ఇస్తున్నాయి. గిరిజన ప్రాంతానికి మేలైన, అనువైన రకాలను గుర్తించడానికి చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు నిరంతరం ప్రయోగాలు చేస్తుంటారు. ఏజెన్సీలో లాభదాయకమైన పంటలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గతంలో యాపిల్, డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెర్రీ, లిచీ వంటి మొక్కలను ప్రభుత్వం సరాఫరా చేసింది. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో గిరిజన రైతులు వాటిని పండించి మంచి ఫలితాలను పొందుతున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి అవకాడో వచ్చి చేరింది. నిజానికి రెండు దశాబ్దాల క్రితమే కేంద్ర కాఫీ బోర్డు అధికారులు కాఫీ మొక్కలకు నీడ కోసమని అవకాడో మొక్కలను మండలంలో గొందిపాకలు పంచాయతీలోని పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ మొక్కలపై రైతులకు అవగాహన లేకపోయినా కాఫీ చెట్లకు నీడనిస్తాయనే ఉద్దేశంతో పెంపకం సాగించారు. ఈ మొక్కలు పెరిగి క్రమేపీ పండ్ల దశకు చేరుకున్నాయి. అయితే ఈ అవకాడో పండ్లకు మార్కెట్‌లో విలువ తెలియక వాటిని రైతులు వృథాగా వదిలేశారు. కొన్నేళ్ల క్రితం ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గ్రామానికి వచ్చి ఈ అవకాడో పండ్లను చూసి దాని విశిష్టత, ఆ పండ్లకు మార్కెట్‌లో ఉన్న విలువను రైతులకు వివరించారు. దాంతో రైతులు నాటి నుంచి మార్కెట్‌లో ఈ అవకాడో పండ్ల అమ్మకాన్ని ప్రారంభించారు. దాంతో వ్యాపారస్తులు సైతం గ్రామాలకు వచ్చి రైతుల నుంచి ఈ పండ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో ఆరు దేశ, విదేశీ రకాలను దిగు మతి చేసుకొని ఎకరం విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు.

### ప్రత్యేక శ్రద్ధతో గిరి రైతుల సాగు

చింతపల్లి మండలంలో గొందిపాకలు, చిక్కుడుబట్టి, చినబరడల, పెదబరడ మొదలైన గ్రామాల్లో రైతులకు ఐటీడీఏ గతంలో వివిధ రకాల పండ్ల మొక్కలతోపాటు అవకాడో మొక్కలను పంపిణీ చేసింది. రైతులు ఈ మొక్కలను తమ పొలాల్లో వేసి పెంచుతున్నారు. ప్రస్తుతం అవి పెరిగి పెద్దవై దిగుబడులను ఇస్తున్నాయి. ఈ అవకాడో పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.

### ఔషధ గుణాలు, పోషకాలు అధికం

అవకాడో పండు ఇతర పండ్ల మాదిరిగా కాకుండా అత్యధిక పోషకాలు, ఔషధ గుణాలు కలిగి ఉన్నట్లు శాస్త్రవేత్తలు, పోషకాల నిపుణులు గుర్తించారు. ప్రధానంగా ఈ పండు క్యాన్సర్ కారకాలను నిరోధించడంతోపాటు కంటి చూపు, మధుమేహం, స్థూలకాయం తగ్గుదలకు, సంతానోత్పత్తికి, జీవక్రియ మెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతున్నట్లు పరిశోధనలో గుర్తించారు.

### చింతపల్లిలో కొత్త రకాలపై పరిశోధనలు

అవకాడో పండ్లకు దేశీయంగానే కాకుండా విదేశాల్లోను మంచి గిరాకీ ఉంది. దీనిని గుర్తించి చింతపల్లి ఉద్యానవన పరిశోధన స్థానంలో గత ఏడాది టికేడి-1, హెూస్ మొక్కల సాగు చేపట్టగా ఈ ఏడాది కొత్తగా పింకిర్టన్, ప్యూర్డ్, రీడ్ వంటి కొత్త రకాలను ఇక్కడికి తీసుకువచ్చి పరిశోధనలు జరుపుతున్నాం. గిరిజన రైతాంగం పండించి ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న అవకాడోకు శాస్త్రీయ నామం లేదు. దాంతో పంటకు మంచి గిట్టుబాటు ధర లభించడంలేదు. ప్రస్తుతం మా క్షేత్రంలో గత ఏడాది మూడు వెరైటీలు, ఈ ఏడాది 3 రకాలపై పరిశోధనలు జరుపుతున్నాం. ఈ కొత్త రకాలను శాస్త్రీయ నామంతో మార్కెట్‌లో ప్రవేశపెట్టవచ్చు. దీంతో మంచి ధర వస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ, మిరియాలు పంటల వలే ఈ అవకాడో పంటను విస్తరించడానికి మేలైన రకాల కోసం ప్రయోగాలు చేపడుతున్నాం.

## ఈసారి దేశంలో ముందుగానే వర్షాలు : ఐఎండి



న్యూఢిల్లీ : ఈసారి దేశంలో వర్షాకాలం ముందే రానుంది. మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. ఒకవేళ అధికారులు అంచనా వేసినట్లు ముందుగానే రుతుపవనాలు కేరళను చేరితే, అప్పుడు 2009 తర్వాత ఈ ఏడాది తొలిసారి వర్షాకాలం ముందుగా వచ్చినట్లవుతుందని ఐఎండి వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతీ కేరళను తాకినట్లు ఐఎండీ డేటా తెలుపుతుంది. సాధారణంగా జూన్ ఒకటో తేదీ సమయానికి కేరళలోకి నైరుతీ రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఈ రుతుపవనాల వల్లే దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా ఆ రుతుపవనాలు విస్తరిస్తాయి. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తిగా ఆ రుతుపవనాలు వెళ్లిపోతాయి. 2025 వర్షాకాలంలో.. సాధారణం కన్నా అధికంగానే వర్షం కురుస్తుందని ఏప్రిల్‌లో ఐఎండీ వివరించిన సంగతి విదితమే. ఎల్ నినో పరిస్థితులు ఉండబోవని ఐఎండీ పేర్కొన్నది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈసారి నాలుగు నెలల్లో వర్షపాతం సాధారణ స్థాయి కన్నా ఎక్కువే ఉంటుందని ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం రవిచంద్రన్ తెలిపారు. ఈసారి వర్షాకాలం ముందే రానున్నదని, మే 27వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ తెలిపింది.

## జగన్ జడ్ ప్లస్ భద్రత కేసులో కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

**కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం**

**వేసవి సెలవుల తర్వాత విచారణ**



అమరావతి : సిఆర్‌పిఎఫ్ లేదా ఎన్ఎస్‌జితో కూడిన జెడ్ ప్లస్ భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులివ్వాలంటూ మాజీ సిఎం వైఎస్ జగన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని శుక్రవారం హైకోర్టు విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రతివాదులైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) డైరెక్టర్, సిఆర్‌పిఎఫ్ డిజి, నేషనల్ సెక్యూర్టీ గార్డ్ (ఎన్ఎసి) డిజి, రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శికి నోటీసులిచ్చింది. తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాత జరుపుతామని జస్టిస్ ఎస్ సుబ్బారెడ్డి ప్రకటించారు. జగన తరపున న్యాయవాది వై నాగిరెడ్డి వాదిస్తూ, పిటిషనర్‌కు భద్రత కల్పన విషయంలో రాష్ట్రం పూర్తిగా నిర్లక్ష్యంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకం లేనందున సిఆర్‌పిఎఫ్ లేదా ఎన్ఎస్‌జీ భద్రత కల్పించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు గతంలోనే పిటిషనర్ కేంద్ర హోంశాఖకు వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. జగన్‌కు ప్రాణహాని ఉందని, రాష్ట్రంలో ఇటీవల జగన్ చేసిన పర్యటనల సమయంలో జరిగిన ఘటనల ను పరిశీలిస్తే ప్రమాదం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి పొన్నారావు ప్రతివాదన చేస్తూ, కౌంటర్ వేసేందుకు గడువు కావాలని కోరారు. రాష్ట్రం తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, జగన్ ఇదే తరహా వ్యాజ్యాన్ని గతంలోనే దాఖలు చేశారని గుర్తు చేశారు. వాదనల తర్వాత హైకోర్టు, ప్రతివాదులకు నోటీసులిచ్చి విచారణను వాయిదా వేసింది.

## శ్రీనగర్, చండీగఢ్‌లలో భారీ పేలుళ్లు



శ్రీనగర్ : భారత్ - పాక్‌ల మధ్య ఉద్రిక్తత తీవ్రతరమవుతున్న వేళ అమృత్‌సర్, పఠాన్‌కోట్, శ్రీనగర్, చండగఢ్, జమ్మూ, పూంఛ్‌లలోని ప్రజలు అరచేత ప్రాణాలు పట్టుకొని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. శనివారం తెల్లవారుజామున శ్రీనగర్, చండీగఢ్‌పై పాకిస్తాన్ మరోసారి దాడులకు తెగబడింది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. శుక్రవారం రాత్రి నుంచి శ్రీనగర్ విమానాశ్రయం సహా అనేక ప్రాంతాలపై పాకిస్థాన్ వరుస కాల్పులు జరిపింది. ఈ దాడులను భారత సైన్యం విజయవంతంగా అడ్డుకుంది. అయితే, విమానాశ్రయం సహా కీలకమైన స్థావరాల సమీపంలో పేలుడు జరిగినట్లు శబ్దాలు వచ్చాయని అధికారులు తెలిపారు. పేలుడు శబ్దాలు వినిపించిన వెంటనే నగరంలో సైరన్లు మోగాయని తెలిపారు. లోయలోని చాలా ప్రాంతాల్లో బ్లాక్‌అవుట్ అమలులో ఉందని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా నుంచి గుజరాత్‌లోని భుజ్ వరకూ, అంతర్జాతీయ సరిహద్దుతో పాటు పాకిస్తాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి 26 ప్రదేశాల్లో డ్రోన్లు కనిపించాయని ఇండియన్ ఆర్మీ తెలిపింది. " భారత సాయుధ బలగాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. ఇలాంటి గగతనతల దాడులన్నింటినీ ట్రాక్ చేస్తూ, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలతో నిర్వీర్యం చేస్తున్నాయి " అని ఆర్మీ పేర్కొంది.

## 'శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి'



చైనా : " శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి " అని చైనా మరోసారి పిలుపునిచ్చింది. భారత్ - పాక్ ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో. ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం కోసం అంతర్జాతీయంగా పలు దేశాలు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో గత శుక్రవారం చైనా స్పందిస్తూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. మరోసారి చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. " భారత్- పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకుఅవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం"అని బీజింగ్ పేర్కొంది.

# భారత్-పాక్ ఘర్షణలో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ

**పాక్ చెయ్యి వదిలేసిన అమెరికా**

**గతంలో ఘర్షణ జరిగిన ప్రతిసారీ పాక్‌కు అమెరికా వత్తాసు**

**ఈసారి పాక్ బుద్ధి తెలిసి దూరం పెట్టిన ట్రంప్ యంత్రాంగం**

**విస్పష్టమైన ప్రకటన చేసిన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**

**దిక్కు తోచని స్థితిలో దాయాది దేశం..**



గిల్లి కయ్యం పెట్టుకోవటం.. గట్టిగా నాలుగు దెబ్బలు తగిలేసరికి అమెరికా కాళ్లపై పడి కాపాడాలని వేడుకోవటం.. ఆ దేశం వెంటనే రంగంలోకి దిగి భారత్‌కు నచ్చజెప్పి వెనక్కు తగ్గేలా చేయటం.. 1971 నుంచీ పాకిస్తాన్ తీరు ఇదే. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. పాకిస్తాన్ దుష్టబుద్ధి అమెరికా పాలకులకు కూడా తెలిసి వచ్చింది. పొరుగుదేశంతో నువ్వు గొడవ పెట్టుకుంటే నిన్ను నేనెందుకు కాపాడాలని అమెరికా నిలదీస్తోంది. 'భారత్%-%పాక్ సైనిక ఘర్షణలో జోక్యం చేసుకోవటం మా పని కాదు'అని అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ విస్పష్టమైన ప్రకటన చేశారు. దీంతో దాయాది దేశానికి దిక్కు తోచటం లేదు.

### కాపాడుతూ వచ్చిన అమెరికా

1971 యుద్ధం, 1999 కార్గిల్ యుద్ధం, 2001లో ఘర్షణ, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ వైమానిక దాడులు.. ఇలా భారత్ చేతిలో చావుదెబ్బ తిన్న ప్రతిసారీ పాకిస్తాన్ పాలకులు రాత్రికి రాత్రి అమెరికాలో వాలిపోయి కాపాడాలని ఆ దేశ పెద్దలకు మొరపెట్టుకున్నారు. నాడు పాకిస్తాన్ పక్షపాతిగా ఉన్న అమెరికా అడిగిందే తడవుగా రంగంలోకి దిగి భారత్‌తో చర్చలు జరిపి శాంతించేలా చేసేది. 1971 యుద్ధ సమయంలో పాక్‌కు మద్దతుగా ఏకంగా అణ్వాయుధాలు గల విమాన వాహక నౌక యూఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజ్ నాయకత్వంలో 7వ ఫ్లీట్‌ను బంగాళాఖాతంలో మోహరించింది. 1999లో జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్‌ను ఉగ్రమూకల ముసుగులో పాక్ సైన్యం ఆక్రమించింది. ఆలస్యంగా గుర్తించిన భారత సైన్యం.. భీకర దాడులతో వారిని తరిమికొట్టింది. అంతటితో వదలకూడదని పాక్‌పై సైనిక చర్యకు ప్రణాళిక వేసింది. భారీగా యుద్ధ ట్యాంకులు, ఆయుధాలను సరిహద్దులకు తరలించింది. తన గూఢచారి ఉపగ్రహాల ద్వారా ఈ విషయాన్ని అమెరికా పసిగట్టి పాక్‌కు ఉప్పందించింది. దీంతో భయపడిన నాటి పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్.. అమెరికాకు పరుగు పెట్టి అప్పటి అగ్రరాజ్య అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో సమావేశమయ్యాడు. మొదట కార్గిల్‌ను తాము ఆక్రమించలేదని బుకాయించిన నవాజ్‌షరీఫ్.. క్లింటన్‌తో సమావేశం తర్వాత 1999, జూలై 12న కార్గిల్ నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు ప్రకటించటం గమనార్హం. 2001లో పాక్ ఉగ్రవాదులు భారత పార్లమెంటుపై దాడి చేయటంతో రెండు దేశాలు మరోసారి యుద్ధం ముందు నిలిచాయి. ఆ సమయంలో కూడా పాక్‌ను కాపాడేందుకు అమెరికా జోక్యం చేసుకుంది. తన రాయబారిని ఢిల్లీకి పంపి భారత్‌ను శాంతింపజేసింది. ఇలా దౌత్యంతోపాటు ఎప్పటికప్పుడు ఆయుధాలు, అత్యాధునిక యుద్ధ విమానాలు కూడా సరఫరా చేస్తూ పాకిస్తాన్‌ను అగ్రరాజ్యం కాపాడుతూ వచ్చింది. ఎఫ్-16 సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను కూడా పాక్‌కు అందించింది.

### కాలం మారింది.. కథ అడ్డం తిరిగింది

చాలాకాలంపాటు ఆత్మరక్షణ విధానాన్నే అవలంబించిన భారత్.. కొంతకాలంగా దూకుడుగా వెళ్తోంది. అంతర్జాతీయ సమాజంలో పేరుప్రతిష్టలు పెంచుకోవటంతోపాటు తెలివైన దౌత్య విధానాలతో కొత్త మిత్రులను సంపాదిస్తోంది. ఈ క్రమంలో భారత్ పట్ల అమెరికా వైఖరిలోనూ స్పష్టమైన మార్పు వచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. జేడీ వాన్స్ ప్రకటనే అందుకు ఉదాహరణ అని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణపై ఇటీవల ఆయన ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో స్పష్టమైన ప్రకటన చేశారు. 'చూడండి.. ఆయుధాలు వదిలేయాలని భారత్‌కుగానీ, పాకిస్తాన్‌కు గానీ మేము చెప్పలేము. ఈ ఘర్షణలో జోక్యం చేసుకోవటం మా పని కూడా కాదు. దౌత్య మార్గాల ద్వారానే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని మేము మొదటి నుంచీ చెబుతున్నాం. ఈ ఘర్షణ తీవ్రస్థాయి యుద్ధంగా, అణు యుద్ధంగా మారబోదనే నమ్ముతున్నాం'అని వాన్స్ పేర్కొన్నారు. వాన్స్ ప్రకటనతో దిక్కుతోచని స్థితిలో పడిన పాక్‌పై.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మద్దతుదారైన నిక్కీ హేలీ మరో బాంబు వేశారు. పహల్గాంలో సామాన్యులను చంపిన ఉగ్రవాదులను శిక్షించే హక్కు, అధికారం భారత్‌కు ఉన్నాయని ఆమె ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. బాధితురాలిగా నటించొద్దని పాక్‌కు చురకలంటించారు.

# రియల్‌టైమ్ నిఘా పెట్టడంలో దిట్ట

**తుర్కియే సోంగర్లు**

**పాకిస్తాన్ దాడులు వీటితోనే..**

**ప్రమాదకర డ్రోన్లుగా గుర్తింపు**

**మెషీన్‌గన్స్, క్షిపణులు ప్రయోగించగల సత్తా**



భారత త్రివిధ దళాల ముప్పేట దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తాన్.. కొత్త కుయుక్తులతో యుద్ధానికి దిగుతోంది. సంప్రదాయ ఆయుధాలకు బదులుగా అత్యాధునిక డ్రోన్లతో భారత్‌పై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తోంది. వీటిలో పాక్ మిత్రదేశం తుర్కియే తయారుచేసిన అత్యంత ప్రమాదకరమైన అసిస్‌గార్డ్ సోంగర్ సాయుధ యూఏవీలు ఉండటం కాస్త కలవరపెడుతోంది. ఎందుకంటే ఆధునిక యుద్ధ పద్ధతుల్లో సోంగర్ డ్రోన్లు సమర్థవంతమైనవిగా నిరూపించుకున్నాయి. వీటిని బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చు. గురువారం రాత్రి భారత్‌లోని 36 మిలిటరీ, పౌర లక్ష్యాలపై సోంగర్ డ్రోన్లతోనే పాక్ దాడిచేసినట్లు మన రక్షణ శాఖ ప్రకటించింది. వాటిని సమర్థంగా కూల్చేసినట్లు శుక్రవారం మీడియా సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. సోంగర్ డ్రోన్లను సమర్థంగా అడ్డుకోగల గగనతల రక్షణ వ్యవస్థలు మనకు ఉన్నప్పటికీ.. వాటిని తక్కువగా అంచనా వేయకూడదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

### సోంగర్ డ్రోన్ల ప్రత్యేకతలు ఇవీ..

సోంగర్ డ్రోన్లను తుర్కియేలోని అంకారా కేంద్రంగా పనిచేస్తున్న అసిస్‌గార్డ్ సంస్థ తయారుచేసింది. వీటిని 2019 నుంచి వినియోగిస్తున్నారు. ఈ డ్రోన్లు స్వయంచాలితంగా ప్రయాణించి లక్ష్యాలపై దాడులు చేసి తిరిగి గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌కు చేరుకోగలవు. రిమోట్ కంట్రోల్‌తో కూడా నియంత్రించవచ్చు. ఆధునిక యుద్ధ తంత్రంలో ఇవి కీలకంగా పనిచేయగలవు. సరిహద్దులు దాటి దాడులు చేయటంలో వీటికి మంచి రికార్డు ఉంది.

### ప్రమాదకర సాయుధ డ్రోన్

సోంగర్ డ్రోన్‌కు ఒక అత్యాధునిక ఆటోమేటిక్ మెషీన్ గన్ అమర్చబడి ఉంటుంది. చిన్నపాటి క్షిపణులను కూడా ఇది ప్రయోగించగలదు. 81 ఎంఎం మోర్టార్ రౌండ్స్‌ను పేల్చగలదు. వ్యక్తులు, వాహనాలు, ఎంపికచేసిన చిన్నపాటి లక్ష్యాలపై సమర్థంగా దాడి చేయగలదు.

### ఫ్లైట్ పెర్ఫార్మెన్స్

సోంగర్ డ్రోన్లు 45 కిలోల బరువును మోసుకెళ్లగలవు. పేలోడ్ లేకుండా ఏకబిగిన 25 నుంచి 30 నిమిషాల వరకు గగనతలంలో ఎగరగలవు. గ్రౌండ్ కంట్రోల్ స్టేషనునుంచి 3-5 కిలోమీటర్ల దూరం వరకు ఇవి దాడులు చేయగలవు. సముద్రమట్టం నుంచి 2,800 మీటర్లు, భూ మట్టం నుంచి 400 మీటర్ల ఎత్తువరకు ఇవి ఎగరగలవు.

### రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్

లక్ష్యాలపై నిఘా పెట్టడంలో కూడా సోంగర్ డ్రోన్లది అందెవేసిన చెయ్యి. ఇవి గగనతలంలో ఎగురుతూ గ్రౌండ్ స్టేషన్‌కు రియల్‌టైమ్ (ప్రత్యక్షంగా)లో వీడియోలు, చిత్రాలను పంపగలవు. దాడుల తర్వాత జరిగిన నష్టాన్ని కూడా విశ్లేషించి వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు పంపుతాయి. రాత్రి-పగలు అన్న తేడా లేకుండా ఎలాంటి వాతావరణంలో అయినా ఈ డ్రోన్లు నిఘా పెట్టగలవు. రాత్రిపూట వీడియోలు, చిత్రాలు తీసేందుకు వీటిలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు ఉంటాయి.

### స్వయంచాలితం

ఈ డ్రోన్లను గ్రౌండ్ స్టేషన్ నుంచి రిమోట్ కంట్రోల్‌తో నియంత్రించవచ్చు. అవసరమైతే వాటికవే స్వయంగా ఎగురుతూ నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేయగలవు. గ్రౌండ్ స్టేషన్‌తో సంబంధాలు తెగిపోయినా వాటికవే తిరిగి స్టేషన్‌ను వెతుక్కుంటూ తిరిగి రాగలవు. బ్యాటరీలో చార్జింగ్ తగ్గిపోయినా వెంటనే గ్రౌండ్ స్టేషన్‌కు వచ్చేస్తాయి. దీంతో వీటిని నియంత్రించేవారికి పని సులువు అవుతుంది.

### గుంపుగా దాడిచేయగల సామర్థ్యం

సోంగర్ డ్రోన్లు ఒక్కొక్కటిగా నిర్దేశించిన లక్ష్యాలతోపాటు దాడులు చేయటంతోపాటు గుంపులుగా కూడా వెళ్లి దాడులు చేయగలవు. పదుల సంఖ్యలో ఒకేసారి ఆకాశంలోకి ఎగిరినప్పుడు స్వయంగా సమన్వయం చేసుకుంటూ లక్ష్యంపై నలు దిక్కుల నుంచి దాడి చేస్తాయి. శత్రువు రక్షణ వ్యవస్థను గందరగోళపర్చి సమర్థంగా దాడులు చేయగల సత్తా వీటికి ఉంది. గురువారం భారత్‌లోని పలు లక్ష్యాలపై ఇలాగే దాడులు చేసినట్లు గుర్తించారు.


# భారతీయుల రూటే.. సపరేటు

**పెరుగుతున్న నాయకత్వ లక్షణాలు**

**కష్టపడితేనే.. కలదు సుఖం అని నమ్ముతున్న ప్రజలు**

**ఆమ్రోప్ పరిశోధనా సంస్థ అధ్యయనంలో వెల్లడి**

అమరావతి : ఋగ్వేదంలోనే యోగా గురించి ప్రస్తావించాం. సింధు లోయ నాగరికతలోనే టాయిలెట్లను వినియోగించాం. గూస్బెర్రీ వంటి మొక్కల సారాన్ని వినియోగించి షాంపూలు తయారు చేశాం.. 'సున్నా'కు విలువ కనిపెట్టి ప్రపంచానికి అందించాం. ఇలా విశ్వజగతికి భారతీయులు ఆది నుంచి నాయకులుగానే పరిచయమయ్యారు. నేటికీ అదే విధంగా ఉండేందుకు, గ్లోబల్ లీడర్లుగా పిలిపించుకునేందుకు భారతీయులు ఇష్టపడుతున్నారు. అందుకోసమే కష్టాన్నీ సంతోషంగా స్వీకరిస్తున్నారు. ప్రపంచ ప్రముఖ కార్యనిర్వాహక పరిశోధన సంస్థ అయిన అమ్రోప్ నిర్వహించిన అధ్యయనంలో భారత్ ప్రజల తాజా మనోగతం ఆవిష్కృతమైంది. గ్లోబల్ సౌత్ దేశాలైన భారత్, చైనా, బ్రెజిల్‌తోపాటు పాశ్చాత్య దేశాలైన అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, పోలాండ్‌లో పని వైఖరిపై అమ్రోప్ తాజాగా అధ్యయనం జరిపింది.కష్టించి పనిచేయడం వల్లనే గుర్తింపు లభిస్తుందని, జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, ఆశయం నెరవేరుతుందని భారతీయులు నమ్ముతున్నట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఈ సర్వేలో 20 ఏళ్లు నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల బ్యాచిలర్ డిగ్రీ, అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉన్న 8 వేల మంది నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి దేశం నుంచి వెయ్యి మంది సర్వేలో పాల్గొన్నారు.



**అధ్యయనంలోని ముఖ్యాంశాలు:**

**భారతీయుల్లో నాయకత్వ లక్షణాలు** పెరుగుతున్నాయి. **92** శాతం మంది పని చేయడంలోనే సంతోషం ఉందని అంటున్నారు. **73%** మంది మంచి ఉద్యోగం, జీవితం ఉండాలని కోరుకుంటున్నారు. '**75%** మంది కష్టపడి పనిచేయడం సాధారణంగా మనిషి ధర్మమని నమ్ముతున్నారు. **42%** మంది వారానికి **40** గంటలకు మించి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది ఫ్రాన్స్‌లో **16** శాతంగా ఉంది. **76** శాతం మంది భారతీయ నిపుణులు ఒక కంపెనీని నడిపించాలని లేదా తామే సొంతంగా ఒక సంస్థను నిర్వహించాలని కోరుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారు **36%** కాగా, అమెరికాలో **49%** మంది ఉన్నారు. తామేంటో నిరూపించుకునేలా పనిచేయాలని **73%** మంది భారతీయులు అనుకుంటున్నారు. జర్మనీలో ఇలాంటి వారి సంఖ్య **41** శాతం మాత్రమే ఉంది. మన దేశంలో **84** శాతం మందికి చదువు, వ్యాపారం, ఉద్యోగం వంటి మంచి కెరీర్ ముఖ్యంగా భావిస్తున్నారు. 'పాశ్చాత్య దేశాల్లో మాత్రం **62%** మంది తాము కుటుంబానికే ప్రాధాన్యత ఇస్తామని పేర్కొనడం గమనార్హం. ' రాజకీయ నాయకుడిగా ఉండేందుకు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా **40** శాతం మంది ఇష్టపడటం లేదు.

ప్రభాత సూర్యుడు

## సంపాదకీయం

# ప్రాణంపోసే నిర్ణయం

## (విశ్లేషణ)

అనునిత్యం నెత్తుటి చరిత్ర రచిస్తున్న రహదారులపై దుర్మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక మంచి ప్రయత్నం చేసింది. సోమవారం విడుదలైన ఒక నోటిఫికేషన్ ప్రకారం ఇకపై రోడ్డు ప్రమాదాల్లో చిక్కుకున్నవారికి ఆస్పత్రుల్లో నగదురహిత చికిత్స వెనువెంటనే అందుతుంది.ప్రమాద బాధితులకు లక్షన్నర రూపాయల వరకూ చికిత్స సదుపాయం లభించటంతోపాటు వారం రోజుల వరకూ వైద్య సేవలు పొందే వెసులుబాటునిచ్చారు.దేశంలో ఏ రోడ్డుపై ప్రమాదం జరిగినా ఈ పథకం వర్తిస్తుందని నోటిఫికేషన్ చెబుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ఏడాది పాలన పూర్తి చేసుకున్నాక 2015 జూలైలో 'మన్ కీ బాత్' కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను ప్రస్తావించారు. బాధితులకు చికిత్స చేయటంలో ఆస్పత్రులు వెనుకంజ వేయకుండా నగదురహిత వైద్యానికి వీలుకల్పిస్తామని ఆ సందర్భంలోనే చెప్పారు. అది ఇన్నాళ్లకు సాకారమైంది.ప్రమాదాల నియంత్రణకు కేంద్రం అనేక చర్యలు తీసుకుంటూనేవుంది. కానీ పెద్దగా ఫలితాన్నిస్తున్న జాడ కనబడదు. ఏటా వెల్లడయ్యే గణాంకాలే ఇందుకు సాక్ష్యం. కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మొన్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో మాట్లాడుతూ ఏటా మన రహ దారులపై దాదాపు 4,80,000 ప్రమాదాలు సంభవిస్తున్నాయని, 1,78,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పినప్పుడు అందరూ దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాద మృతుల్లో 60 శాతం మంది 18-34 యేళ్ల మధ్య వయస్కులేనని ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా తన మంత్రిత్వశాఖ నిస్సహాయతను కూడా వివరించారు. 2024 ఆఖరుకల్లా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య 50 శాతం మేరకు తగ్గించాలని నిర్ణయించుకున్నా ఏమాత్రం సాధ్యపడలేదని, పైపెచ్చు అవి మరింత పెరిగాయని ఆయన ఒప్పుకున్నారు. ప్రమాదాల నివారణ మాట అటుంచి బాధితులకు సకాలంలో వైద్యసాయం అందితే చాలామందిని మృత్యుముఖం నుంచి బయటకు తీసుకురావొచ్చని నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు.ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవిస్తే చికిత్స ఆలస్యం కావటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ డబ్బు విదిలిస్తే తప్ప చికిత్సకు ముందుకురాని ఆస్ప త్రుల కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది గమనించే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకంలో క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందే వెసులుబాటు కల్పించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అదికాస్తా అటకెక్కింది.ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల బెడదపై నాలుగేళ్లక్రితం ఐక్యరాజ్యసమితి దృష్టి సారించింది. 2021-30 మధ్య ఈ ఉదంతాల్లో మరణాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని లక్ష్యనిర్దేశం చేసింది. ఆ మాటెలా వున్నా కేవలం పెను వేగంతో వెళ్లే వాహనాల వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటా యన్నది నిజం కాదు. మొన్న మార్చిలో జరిగిన సదస్సులో కేంద్రమంత్రి గడ్కరీయే ఈ విషయాన్ని అంగీకరించారు. ఇరుకురోడ్డని, మలుపు వున్నదని, వేగం తగ్గించాలని సూచించే బోర్డులూ, మార్కింగ్‌లూ అవసరమైనచోట్ల లేకపోవటం దగ్గర్నుంచి నిర్మాణపరంగా వుండే లోపాల వరకూ అనేకానేక మైనవి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సివిల్ ఇంజనీర్లు మొదలుకొని కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్ల వరకూ ఎవరికీ దీనిపై జవాబుదారీతనం లేదు. సవివర ప్రణాళికా నివేదిక (డీపీఆర్)లు నాసిరకంగా వున్నా అడిగేవారు లేరు. ఆధునిక సాంకేతికతలు అందుబాటులోకి రావటం వల్ల లోపాలను ముందు గానే సులభంగా పసిగట్టడం సాధ్యమవుతోంది. వాటిని అనుసరిద్దామన్న ఆలోచన కూడా రాదు. అతి తక్కువ ప్రమాదాలు జరుగుతున్న ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, స్పెయిన్ దేశాల్లో ఎలాంటి విధానాలు అనుసరిస్తున్నారో గమనించి, వాటిని అమల్లోకి తెచ్చినా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. అసలు మన రోడ్ల నాణ్యతకూ, అమ్మే వాహనాలకూ సంబంధమే లేకుండా పోయింది. అమ్మ కాలు పెంచుకోవటం కోసం అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టి, బ్యాంకు లోన్ల సదుపాయం కల్పించి జనంలో వ్యామోహాన్ని పెంచటం రివాజైంది. ద్విచక్ర వాహనాలు సైతం వాయు వేగంతో పోయేలా డిజైన్ చేస్తుంటే...అవి నిండా ఇరవయ్యేళ్లు లేనివారి చేతికొస్తుంటే ప్రమాదాలు జరగటంలో వింతేముంది? రోడ్డు ప్రమాదాల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం చొరవ తీసుకుని అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కేరళ, యూపీ, నాగాలాండ్ మినహా మరే రాష్ట్రమూ రహదారి భద్రతకు సంబంధించిన విధానమే రూపొందించుకోలేదని ఆ కమిటీ నివేదిక ఎత్తిచూపింది. డ్రైవింగ్ లైసె న్సుల జారీలో, భద్రతా నిబంధనల అమలులో ప్రభుత్వాలు అలసత్వాన్ని చూపుతున్నాయని చెప్పింది. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలూ ఈ లోపాలన్నిటినీ సరిదిద్దుకున్నాయో లేదో సందేహమే! తొలి గంటలో చికిత్స ప్రారంభిస్తే గాయపడినవారిలో కనీసం 50 శాతంమందికి ప్రాణాపాయం తప్పుతుందని వైద్య నిపుణులంటున్న మాట. గతంలో అయితే అసలు ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఆస్పత్రికి తరలించటానికి ఎవరూ ముందుకొచ్చేవారు కాదు. పోలీసులు తమనే అనుమాని తులుగా చూస్తారని, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తుందని చాలామంది భయపడేవారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు మార్చాక ఈ విషయంలో చాలా మార్పువచ్చింది. నగదు రహిత చికిత్స అందించటానికి వీలుకల్పించే చర్య ప్రశంసనీయమైనది. కానీ అంతకన్నా ముందు ప్రమాదా లకు దారితీస్తున్న పరిస్థితుల్ని చక్కదిద్దటానికి ప్రయత్నించాలి. అన్ని స్థాయుల్లో జవాబుదారీతనం నిర్ణయించాలి. అప్పుడుగానీ ప్రమాదాల నియంత్రణ సాధ్యంకాదు.

# అందాలతో అలరిస్తూ.. వ్యాపారాలు పెంచుతూ..

తెలంగాణ రాష్ట్రం 2025 సంవత్సరానికిగాను మిస్ వరల్డ్ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇస్తుంది. మే 31 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. కేవలం ఇది ఒక ప్రతిష్ఠాత్మక అందాల పోటీ మాత్రమే కాదు. స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందేందుకు దోహదపడే కార్యక్రమం. వినోదం, స్పాన్సర్‌షిప్‌లు, పర్యాటకం, డొనేషన్స్‌ను సమ్మిళితం చేసే శక్తివంతమైన ప్రపంచ వ్యాపార నమూనా. 130కిపైగా దేశాల నుంచి అందగత్తెలు, జడ్జీలు, కార్యక్రమాన్ని ఎండార్స్ చేసే కంపెనీల ప్రతినిధులు విచ్చేస్తారు. ఈ ఈవెంట్ చుట్టూ జరిగే వ్యాపార ధోరణులను విశ్లేషిద్దాం.

స్పాన్సర్‌షిప్‌లు, బ్రాండ్ భాగస్వామ్యాలు

ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్ స్టైల్ కంపెనీలతో సహా ప్రధాన బ్రాండ్లు గ్లోబల్ విజిబిలిటీ కోసం ఈ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటున్నాయి. ప్రఖ్యాత కాస్మెటిక్ దిగ్గజాలు, ఆభరణాల డిజైనర్లు, లగ్జరీ ఫ్యాషన్ హౌజ్‌ల పోటీదారులు ఈవెంట్ సెగ్మెంట్లను స్పాన్సర్ చేస్తూ హై-ప్రొఫైల్ మార్కెటింగ్ అవకాశాన్ని అందుకోవచ్చు.

బ్రాడ్‌కాస్టింగ్, మీడియా హక్కులు

ఈ అందాల పోటీని ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేసేందుకు ప్రత్యేక ప్రసార హక్కుల కోసం నెట్‌వర్క్ సంస్థలు పోటీ పడుతుంటాయి. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, పే-పర్-వ్యూ మోడల్స్, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్ ఇంటిగ్రేషన్ల ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చు.

పర్యాటకం

ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఇతర దేశాల ప్రముఖులు హైదరాబాద్ రానున్నారు. దాంతో స్థానికంగా ఆతిథ్య రంగం అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల హొటళ్లు, రెస్టారెంట్లు, రవాణా సేవలు, స్థానిక వ్యాపారాలు గణనీయంగా ప్రయోజనం పొందుతాయి. స్థానిక పర్యాటకం, సాంస్కృతిక సంపదను అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ఈ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటారు.




టికెట్ అమ్మకాలు, వీఐపీ ప్యాకేజీలు

ప్రీమియం సీటింగ్, లగ్జరీ అనుభవాలు, గాలా డిన్నర్లతో మిస్ వరల్డ్ ఈవెంట్ ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. ఇది టికెట్ ఆదాయానికి దోహదం చేస్తుంది. వీఐపీలు, స్పాన్సర్ల కోసం ప్రత్యేక ప్యాకేజీలు ఉంటాయి.

బ్రాండ్ ప్రమోషన్

మిస్ వరల్డ్ ఈవెంట్‌లో సుందరీమణులు ధరించే బ్రాండెడ్ దుస్తులు, యాక్సెసరీల ద్వారా కంపెనీలు తమ బ్రాండ్‌ను ప్రమోట్ చేసుకునే అవకాశం ఉంటుంది. కో-బ్రాండెడ్ ఉత్పత్తుల విక్రయాలు పెంచుకునేందుకు ఈ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటారు.

# ఇది మన.. నారీ శక్తి

## కల్నల్ సోఫియా ఖురేషీ
## వింగ్ కమాండర్ వ్యోమికా
## త్రివిధ దళాల్లో రాణిస్తున్న ధీరవనితలు
## 2024 నాటికి ఆర్మీలో 4.12%
## ఎయిర్‌ఫోర్స్‌లో 13.40%, నేవీలో 6.81%
## రక్షణ పరిశోధన రంగంలో 15.53%
## పోలీసు విభాగంలో 9.74% అతివలే



కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.. ఇప్పుడు యావత్ భారతదేశం మారుమోగుతున్న పేర్లు. ఆపరేషన్ సిందూర్ వివరాలు తెలిపేందుకు ఏర్పాటుచేసిన అధికారిక విలేకరుల సమావేశానికి ఇద్దరు మహిళా అధికారులు నాయకత్వం వహించడం ఒక చరిత్ర. వీరిద్దరూ దేశంలో మన నారీ శక్తికి ప్రతిబింబాలు. అంతేకాదు, సాయుధ దళాల్లో పెరుగుతున్న మహిళల బలానికి ప్రతీక. దీంతో ఇప్పుడు అందరి దృష్టి... మన మహిళా శక్తిపై పడింది. అసలు మన దేశంలో త్రివిధ దళాల్లో ఎంతమంది సివంగులు ఉన్నారు.. రక్షణ పరిశోధన రంగంలో ఎందరు మహిళా మేధావులు మన కీర్తి పతాకను అంతర్జాతీయ యవనికపై రెపరెపలాడేలా చేస్తున్నారు... పోలీసు విభాగంలో రాణిస్తున్న అతివలు ఎందరు... ఇవిగో ఆ ఆసక్తికర వివరాలు..

రక్షణ దళాల్లో రుద్రమలు

మనదేశంలోని త్రివిధ దళాల్లో అత్యధిక శాతం మహిళలు ఉన్నది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో. అందులో 2024 నాటికి 13.40 శాతం అతివలే. ఆ తరువాత.. ఇండియన్ నేవీలో అత్యధిక శాతం మహిళలు ఉన్నారు. 2020లో 5.53 శాతం నారీ శక్తి ఉంటే.. 2024 నాటికి అది 6.81 శాతానికి పెరిగింది. ఇక, ఆర్మీలో 2020లో 3.84 శాతం వీరనారీమణులు ఉంటే.. 2024కి అది 4.12 శాతానికి పెరిగింది.

రక్షణ పరిశోధన రంగంలోనూ...

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ.. డీఆర్‌డీఓలో మహిళా ప్రాతినిధ్యం చాలా ఎక్కువగా ఉంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని అయిన జే.మంజుల.. డీఆర్‌డీఓలో శాస్త్రవేత్తగా అడుగుపెట్టి అంచెలంచెలుగా ఏకంగా ఆ సంస్థ డైరెక్టర్ పదవినే చేపట్టారు. ఇలా శాస్త్రవేత్తలుగా, వివిధ విభాగాల్లో రాణిస్తున్న మహిళలు డీఆర్‌డీఓలో అత్యధిక శాతంలో ఉన్నారు. 2020 నుంచి చూస్తే సగటున 3,000 మంది.. అంటే మొత్తం ఉద్యోగుల్లో సగటున 15 శాతానికిపైగా మహిళలే ఉన్నారు.

పోలీసు బలగం దేశంలో 2023 జనవరి

1 నాటికి 31,50,331 మంది పోలీసు సిబ్బంది ఉంటే.. అందులో మహిళలు 3,06,748. అంటే మొత్తం సిబ్బందిలో 9.74 శాతం. ఇందులో కూడా సివిల్ పోలీస్ విభాగంలో అత్యధికంగా 14.97 శాతం ఉన్నారు. డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ (డీఏఆర్‌పీ) విభాగంలో 11.31 శాతం, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)లో 9.22 శాతం, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంలో (సీఐఎస్ఎఫ్) 7.04 శాతం అతివలే.

# పాకిస్తాన్ మనపై యుద్ధానికి తలపడితే..
# మరోసారి కొత్త దేశం అవతరిస్తుందా?

భారత దేశ సైనిక పటిమకు, వ్యూహానికి అద్దం పట్టింది మే 6 అర్ధరాత్రి 1.05 నుండి 1.30 ని. ల వరకు భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్. ఎవరు ఊహించని విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఖచ్చితమైన లక్ష్య ఛేదనతో, పాకిస్తాన్ పౌరులకు, సైనిక స్థావ రాలకు ఎటువంటి నష్టం కలుగకుండా, అంత ర్జాతీయ సరిహ ద్దు అతిక్రమించకుండా ఏకంగా తొమ్మిది ఉగ్ర కేంద్రాలను భారత్ ధ్వంసం చేసి, వంద మందికి పైగా ఉగ్రవాదులను నిర్జించి పహెల్గాం అమరులకు నివాళు లు అర్పించింది.భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత మొట్ట మొదటి సారిగా ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ స్వర్గధామంగా మారిం దనే విషయాన్ని ప్రపంచ దేశాలకు ఆధారాలతో తెలియజెప్పి వారి మద్దతును పొందడంలో భారత్ సఫలీకృతం అయింది. ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి జయశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర అధికారులు నిరంతరం వివి ధ దేశాలతో జరిపిన సంప్రదింపులు సత్ఫలితాలు ఇచ్చాయి. పాకిస్తాన్ కోరి మరీ పెట్టించుకున్న భద్రతా మండలి సమావేశంలో తనకు మిత్ర దేశమైన చైనాతో సహా ఒక్క దేశం కూడా వారికి మద్దతుగా నిలవలేదంటే అది దౌత్యపరంగా భారత్ సాధించిన అద్భుత విజయంగా భావించాలి.

సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..

1947లో దేశ విభజన జరిగి భారత్, పాకిస్తాన్ దేశాలుగా ఏర్పడినప్పటి నుండి పాకిస్తాన్ భారతదేశాన్ని ఏదో విధంగా ఇబ్బంది పెడుతూనే ఉంది. దేశ విభజన జరిగిన ఏడాదే ట్రైబల్ మిలిటెంట్ల ముసుగులో పాకిస్తాన్ ఆర్మీ కశ్మీరులో కొంత భాగాన్ని ఆక్రమించుకుని పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ పేరుతో తమ ఆధీనంలో ఉంచుకుంది. 1965లో భారత్ పాక్ యుద్ధం, 1971 బంగ్లాదేశ్ విమోచన పోరాటం, 1999లో జరిగిన కార్గిల్ (ఆపరేషన్ విజయ్) యుద్ధాలలో అవమానకరమైన ఓటములను చవి చూసిన తదుపరి ప్రత్యక్ష పోరాటానికి బదులుగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్స హిస్తూ, భారత్ పైకి ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ దాయాది దేశం ప్రచ్ఛన్న యుద్ధానికి పాల్పడడం అలవాటుగా మార్చు కుంది. కశ్మీర్‌కు ప్రధాన ఆదాయ వనరైన పర్యాటక రంగాన్ని దెబ్బతీసి తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభ్యం కాకుండా చేసి వారిని ఉగ్రవాదం వైపు ఆకర్షించాలనే దుర్లక్ష్యంతో ఏప్రిల్ 22న పహెల్గాంలో మత ప్రాతిపదికతో ఉగ్రదాడి జరిగింది. అయితే క్లిష్ట సమయంలో అత్యంత చాకచక్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన దౌత్యం, ప్రత్యర్థిని ఆర్థిక దిగ్బంధనం చేసింది.

అష్ట దిగ్బంధనం

సిందూర్ పేరు నుంచి ఉగ్ర లక్ష్యాలను నిర్మూలించే వరకు ఆపరేషన్ సిందూర్ అనేక ప్రత్యేకతలు కలిగి ఉంది. పుల్వామా దాడి అనంతరం భారత ప్రభుత్వం సింధు జలాల ఒప్పందాన్ని నిలిపి వేయడం, పాకిస్తాన్ సరిహద్దులను మూసివేయడం, సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాకిస్తానీ జాతీయులు భారతదేశంలోకి ప్రవేశించకుండా నిషేధించడం వంటి అనేక నిర్ణయాత్మక చర్యలను అమలు చేసింది. పాకిస్తాన్ వ్యవసాయ రంగానికి, ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైన సింధు జలాలను ఆపాలని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్తాన్‌కు ఆశనిపాతం వంటిది. ఒప్పందం కుదిరిన తర్వాత ఎప్పుడూ సింధూ జలాల పంపిణీ ఆపడం జరగలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం ఊహకు అందని విధంగా ప్రధాని మోడీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దాయాది దేశ ప్రజలలో పాలకులపై అసహనం ఏర్పడే అవకాశం ఉంది. సింధు జలాల విషయంలో బిలావల్ భుట్టో చేసిన ఆడంబర ఆర్తనాదాలకు కారణమిదే.




ఆధునిక యుద్ధంలో మనదే ఆధిపత్యం

మన సైనిక బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఎల్.ఓ.సి నుండి 6-100 కి.మీ పరిధిలో ఉన్న భవల్పూర్ జిల్లాలోని మార్కాజ్ సుభాన్ అల్లా, మార్కాజ్ తైబా ( మురిడ్క్), సియాల్ కోటలోని మోహ్మనాజోయా, సర్జాల్ ఉగ్ర శిబిరాలను కూల్చేశాం. భారత అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక ఆయుధాలైన స్కాల్ప్ క్షిపణులు, హ్యామర్ బాంబులు, కమకాజీ డ్రోన్లతో విలయాన్ని పాకిస్తాన్ కు పరిచయం చేశాం. గతంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత్ దాడులు చేసినా అవి పీవోకే, ఎల్.ఓ.సి సమీప ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. కానీ బంగ్లాదేశ్ విమోచన యుద్ధం తర్వాత మొదటి సారిగా ఎల్.ఓ.సికి 100 కి.మీ దూరంలో పాకిస్తాన్‌లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవాల్పూరులో ఉన్న ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, ఉగ్రవాద శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ ప్రదేశానికి సమీపంలోనే ఉన్న పాకిస్తాన్ ఆర్మీ రెజిమెంటల్ సెంటర్లకు చిక్కకుండా, వాటికి ఏటువంటి నష్టం కలిగించకుండా దాడిని నిర్వహించగలగడం ఆధునిక యుద్ధంలో భారత ఆధిపత్యానికి నిదర్శనం.

భారత్ వైపే తక్కిన ప్రపంచం

పహెల్గాం దాడిపై బదులిచ్చే రక్షణ హక్కు భారత్‌కు ఉందని ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. భారత్ సైన్యం కేవలం ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది కానీ సైనిక స్థావరాలపై దాడి చేయలేదు. ఇప్పుడు పాకిస్తాన్ పని అడకత్తెరలో పోక చెక్కలా మారింది. భారత్ యుద్ధం మొదలెట్టిందని చెప్పడానికి వీలు లేదు. అదే సమయంలో తమ భూభాగంపై దాడి చేసి ఉగ్ర శిబిరాలను నాశనం చేసిన నిజాన్ని జీర్ణించుకోలేదు. ప్రతీకార చర్యలు మొదలెడితే పూర్తి స్థాయి యుద్ధానికి తలపడిన నింద పాకిస్తాన్ భరించాలి. ఏ విధమైన చర్యలు తీసుకోకపోతే సైన్యంలో అసంతృప్తి రాజుకుంటుంది. ఒకవేళ యుద్ధానికి తలపడితే భారత దేశ సైనిక బలాన్ని తట్టుకునే సామర్థ్యం, యుద్ధం కొనసాగించే ఆర్థిక బలం దివాళా అంచున ఉన్న పాకిస్తాన్ దేశానికి లేదు. ఈ విజ్ఞత కోల్పోయి పాకిస్తాన్ పూర్తిస్థాయి యుద్ధానికి తెగిస్తే ఆపరేషన్ సిందూర్ వలన బలూచిస్తాన్ దేశం అవతరించడమే కాకుండా, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో అంత ర్భాగం అయ్యే అవకాశం సంభవించవచ్చు.

# టెస్టుల్లో అద్భుతం.. కానీ వన్డే, టీ20లలో ఇప్పటికీ అదే తీరు!



టీమిండియా స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ తీరుపై భారత మాజీ ఆటగాడు సంజయ్ బంగర్ విమర్శలు గుప్పించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పంత్ ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నాడని అన్నాడు. వన్డే, టీ20 క్రికెట్‌లో సరైన షాట్ల ఎంపిక విషయంలో ఇప్పటికీ అతడు తడబడుతుండటం ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నాడు.

అత్యంత ఖరీదైన ఆటగాడిగా

ఐపీఎల్-2025 మెగా వేలంలో రిషభ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఏకంగా రూ. 27 కోట్లకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తద్వారా క్యాష్ రిచ్ లీగ్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఈ ఉత్తరాఖండ్ వికెట్ కీపర్ బ్యాటర్ చరిత్ర సృష్టించాడు.

చెత్త ప్రదర్శన

అయితే, ఆట విషయంలో మాత్రం పంత్ తుస్సుమనిపించాడు. ఇప్పటి వరకు పది ఇన్నింగ్స్ 12.80 సగటుతో.. 99.22 స్ట్రైక్‌రేటుతో 128 పరుగులే చేశాడు. పంత్ ఐపీఎల్ ఆడటం మొదలుపెట్టిన నాటి (2016) నుంచి అతడి కెరీర్‌లో ఇదే అత్యంత చెత్త ప్రదర్శన అని చెప్పవచ్చు.

టెస్టుల్లో అద్భుతం.. కానీ వన్డే, టీ20లలో మాత్రం వేస్ట్!

లక్నో కెప్టెన్‌గా ఫర్వాలేదనిపిస్తున్నా.. బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా పంత్ విఫలం కావడం తీవ్రమైన విమర్శలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో కామెంటేటర్ సంజయ్ బంగర్ మాట్లాడుతూ.. "వైట్ బాల్ క్రికెట్‌ను పూర్తిగా అర్థం చేసుకోవడంలో పంత్ తడబడుతున్న విషయాన్ని మనం గుర్తించాల్సిన అవసరం ఉంది. 50, 20 ఓవర్ల ఫార్మాట్లో అతడి ఆట గొప్పగా లేదు. అయితే, టెస్టు క్రికెట్‌లో మాత్రం అతడొక అద్భుతమైన బ్యాటర్. సంప్రదాయ ఫార్మాట్లో అతడి ఆటకు పేరు పెట్టే పనేలేదు. కానీ ఈ ఐపీఎల్ సీజన్లో అతడు అవుటైన విధానం చూస్తుంటే.. స్కూప్ షాట్లు ఆడేందుకు అతడు విఫలయత్నం చేసిన తీరును గమనించవచ్చు" అని స్టార్ స్పోర్ట్స్ షోలో పేర్కొన్నాడు.

వారం పాటు వాయిదా

అదే విధంగా.. రిషభ్ పంత్ బ్యాటింగ్ టెక్నిక్ సరిగా లేదని సంజయ్ బంగర్ ఈ సందర్భంగా విమర్శించాడు. తనలోని అత్యుత్తమ బ్యాటర్ ఆడే విధానాన్ని పంత్ మర్చిపోయాడని.. అందుకే ఇలా విఫలమవుతున్నాడని అభిప్రాయపడ్డాడు. కాగా ఐపీఎల్-2025లో పంత్ సారథ్యంలో లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికి పదకొండు మ్యాచ్‌లు పూర్తి చేసుకుని.. ఐదు గెలిచి.. ఆరింట ఓడింది. తద్వారా పది పాయింట్లతో పట్టికలో ఏడో స్థానంలో కొనసాగుతోంది. ఇక భారత్- పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్-2025ని వారం పాటు వాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

టీమిండియా తరఫున ఇలా..

టెస్టుల్లో రిషభ్ పంత్‌కు మెరుగైన రికార్డు ఉంది. ఇప్పటికి 43 మ్యాచ్‌లు ఆడి 2948 పరుగులు చేశాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ ఖాతాలో ఆరు టెస్టు సెంచరీలు ఉన్నాయి. అయితే, వన్డేల్లో 31 మ్యాచ్‌లలో కలిపి పంత్ కేవలం 871 పరుగులు మాత్రమే చేయగలిగాడు. 76 అంతర్జాతీయ టీ20లలో కలిపి 1209 పరుగులు సాధించగలిగాడు. ఇక ఐపీఎల్‌లో మొత్తంగా 122 మ్యాచ్‌లు పూర్తి చేసుకుని 3412 రన్స్ తన ఖాతాలో జమ చేసుకున్నాడు.

## టీమిండియా కెప్టెన్‌గా అతడే ఉండాలి: అనిల్ కుంబ్లే




టెస్టుల్లో గత సిరీస్‌లలో వరుస పరాభవాలు చవిచూసిన టీమిండియా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ -2025 ఫైనల్‌కు దూరమైంది. ఈ క్రమంలో డబ్ల్యూటీసీ తాజా ఎడిషన్‌ను విజయంతో ఆరంభించాలని పట్టుదలగా ఉంది. ఇక 2025-27 సీజన్లో భాగంగా తొలుత ఇంగ్లండ్ తో తలపడనుంది. ఇంగ్లండ్ వేదికగా జూన్ 20 నుంచి ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుంది. అయితే, ఈ కీలక సిరీస్‌కు రోహిత్ శర్మ అందుబాటులో ఉంటాడని.. అతడినే కెప్టెన్‌గా కొనసాగిస్తారని తొలుత వార్తలు వచ్చాయి. కానీ అనూహ్యంగా రోహిత్ బుధవారం అధికారికంగా టెస్టులకు వీడ్కోలు పలికాడు.

### రేసులో నలుగురు!

ఈ నేపథ్యంలో టీమిండియా టెస్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ వారసుడు ఎవరన్న అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. యువ ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్ లకు అవకాశం ఇవ్వాలని కొంత మంది మాజీలు సూచిస్తుంటే.. మరికొంత మంది మాత్రం సీనియర్లైన కేఎల్ రాహుల్ లేదా పేస్‌దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రాకు పగ్గాలు ఇవ్వాలంటున్నారు.

కాగా బుమ్రా ఇటీవలి కాలంలో ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడిపై పనిభారం పడకుండా ఉండేందుకు వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి కూడా తొలగించాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి తరుణంలో భారత దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే మాత్రం బుమ్రాకు మద్దతుగా నిలిచాడు.

టీమిండియా కెప్టెన్‌గా అతడే ఉండాలి

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు బుమ్రాను కెప్టెన్‌గా నియమించాలని బీసీసీఐకి సూచించాడు. ఈ మేరకు.. "ఫాస్ట్ బౌలర్‌గా సుదీర్ఘకాలం కొనసాగడం అంత సులువేమీ కాదు. గాయాల బెడద వేధిస్తూనే ఉంటుంది.

ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత చాన్నాళ్లు విరామం తీసుకున్న అనంతరం బుమ్రా మళ్లీ ఐపీఎల్‌తో తిరిగి ఆటలో అడుగుపెట్టాడు. అతడికి ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయన్న మాట వాస్తవమే.


అయితే, కనీసం ఇంగ్లండ్‌తో సిరీస్‌లో మాత్రం కెప్టెన్‌గా అతడికే బాధ్యతలు అప్పగించండి. ఆ తర్వాత ఫిట్‌నెస్ విషయంలో సమస్యలు తలెత్తితే ఆ తర్వాత పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోండి" అని కుంబ్లే ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో పేర్కొన్నాడు.

కాగా బుమ్రాపై పనిభారం తగ్గించే క్రమంలో ఇంగ్లండ్‌లో అత్యధికంగా మూడు మ్యాచ్‌లలో మాత్రమే అతడిని ఆడించాలని సెలక్టర్లు భావిస్తున్నట్లు వార్తలు వినిపించాయి. కాబట్టి ఒకవేళ అతడిని కెప్టెన్‌ను చేస్తే.. మధ్యలోనే మరొకరిని సారథిగా నియమించాల్సి వస్తుందనే కారణంతో.. బుమ్రా పేరును పరిగణనలోకి తీసుకోవడం లేదని సమాచారం.

### ఐదు టెస్టులూ ఆడకపోతే ఏంటి?

అయితే, బుమ్రా నిజంగానే ఇంగ్లండ్‌లో ఐదు టెస్టులూ ఆడకపోవచ్చన్న కుంబ్లే.. కెప్టెన్‌గా నియమించేందుకు అదేమీ అడ్డుకాకపోవచ్చని పేర్కొన్నాడు. బుమ్రా గైర్హాజరీలో వైస్ కెప్టెన్ సారథిగా బాధ్యతలు తీసుకుంటాడని.. ఇందులో ఎలాంటి సమస్యా ఉండదని అభిప్రాయపడ్డాడు. కాగా బుమ్రా గతంలో ఇంగ్లండ్ పర్యటనలో కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఇటీవల ఆస్ట్రేలియా టూర్‌లో భాగంగా రోహిత్ శర్మ గైర్హాజరీలో సారథిగా బాధ్యతలు నిర్వర్తించాడు. కెప్టెన్‌గా.. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్‌ను గెలిపించిన ఈ రైటార్మ్ పేసర్.. సిడ్నీ టెస్టులో మాత్రం జట్టుకు విజయం అందించలేకపోయాడు. ఇక టీమిండియా గత రెండు టెస్టు సిరీస్‌లలో ఘోర ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో కనీవినీ ఎరుగని రీతిలో 3-0తో వైట్‌వాష్‌కు గురికావడం సహా.. ఆసీస్ పర్యటనలో పదేళ్ల తర్వాత బోర్డర్- గావస్కర్ ట్రోఫీ(3-1)ని చేజార్చుకుంది. ఈ రెండు సిరీస్‌లలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా, ఆటగాడిగా పూర్తిగా విఫలమయ్యాడు.

## మిగిలిన మ్యాచ్‌లు మేము నిర్వహిస్తాం: బీసీసీఐకి ఆఫర్!




ధర్మశాల స్టేడియం

ఐపీఎల్-2025 లో మిగిలిన మ్యాచ్‌ల నిర్వహణ ఎప్పుడన్న అంశంపై క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికి ఈ సీజన్‌లో లీగ్ దశలో భాగంగా 58 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్- పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టోర్నీ వాయిదా పడిన విషయం తెలిసిందే.

అందుకే వాయిదా

ఓవైపు యుద్ధం జరుగుతుండగా.. మరోవైపు వినోదం కోసం ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించడం సరికాదని భావిస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి, సైన్యానికి మద్దతుగా నిలిచే క్రమంలో వారం రోజుల పాటు ఐపీఎల్-2025ని వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు బీసీసీఐని సంప్రదించినట్లు సమాచారం. ఐపీఎల్ తాజా ఎడిషన్‌లో మిగిలిన పదహారు మ్యాచ్‌లకు తాము ఆతిథ్యం ఇస్తామని ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.

మిగిలిన మ్యాచ్‌లు మేము నిర్వహిస్తాం

ది గార్డియన్ కథనం ప్రకారం.. ఈసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్ గౌల్డ్ బీసీసీఐ అధికారులను సంప్రదించి.. ఐపీఎల్-2025లో మిగిలిన మ్యాచ్‌ల నిర్వహణ గురించి ప్రతిపాదనలు చేశారు. బీసీసీఐకి అభ్యంతరం లేకపోతే తమ దేశంలో ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తామని తెలిపారు. "వారం రోజుల తర్వాత కూడా ఐపీఎల్-2025ను పునఃప్రారంభించేందుకు పరిస్థితులు అనుకూలించకపోతే.. ఈసీబీ ఆ బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా ఉంది. సెప్టెంబరులో మిగిలిన మ్యాచ్‌లను తాము పూర్తి చేస్తామని ఈసీబీ వర్గాలు వెల్లడించాయి" అని ది గార్డియన్ పేర్కొంది. కాగా మార్చి 22న మొదలైన ఐపీఎల్ పద్దెనిమిదవ ఎడిషన్ మే 25తో ముగియాల్సి ఉంది. అయితే, సరిహద్దులో ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాలలో మే 8 నాటి పంజాబ్ కింగ్స్- ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ మధ్యలోనే రద్దు చేశారు. ఈ క్రమంలో టోర్నీని నిరవధికంగా వాయిదా వేస్తారనే వార్తలు రాగా.. వారం పాటు నిలిపివేస్తున్నట్లు పేర్కొంది.

ఢిల్లీకి చేరుకున్నారు

ఇదిలా ఉంటే.. పంజాబ్- ఢిల్లీ ఆటగాళ్లతో సహా సహాయక సిబ్బంది మొత్తాన్ని వందే భారత్ రైలులో జలంధర్ నుంచి ఢిల్లీకి సురక్షితంగా తరలించారు. ఇక కొంత మంది విదేశీ ఆటగాళ్లు స్వదేశాలకు వెళ్లాలని భావిస్తుండగా.. ఫ్రాంఛైజీలు అందుకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు.. దాడులకు బరితెగించిన పాకిస్తాన్‌కు భారత్ దీటుగా సమాధానం ఇస్తుండటంతో దాయాది ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ సూపర్ లీగ్-2025ని ఇప్పటికైతే నిలిపివేస్తున్నట్లు పాక్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది.




## భారత్‌లో WTC ఫైనల్-2027!.. ఐసీసీ నిర్ణయం?




2021లో ట్రోఫీ తో కోహ్లి

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్-2027 ఫైనల్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోందా?.. అంటే భారత క్రికెట్ నియంత్రణ మండలి వర్గాల నుంచి అందుకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ మెగా మ్యాచ్‌ను నిర్వహించేందుకు తాము ఆసక్తిగా ఉన్నట్లు బీసీసీఐ.. అంతర్జాతీయ క్రికెట్ మండలి కి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

### మేము నిర్వహిస్తాం

గత నెలలో జింబాబ్వే వేదికగా ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌కు భారత్ తరఫున అరుణ్ ధుమాల్ హాజరయ్యారు. ఈ క్రమంలో చర్చల్లో భాగంగా డబ్ల్యూటీసీ ఫైనల్ నిర్వహణ పట్ల బీసీసీఐకి ఆసక్తి ఉందన్న విషయాన్ని ఆయన ఐసీసీ అధికారులకు చెప్పినట్లు 'ది గార్డియన్' కథనం పేర్కొంది.కాగా 2019లో తొలిసారిగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌ను ఆరంభించారు. ఇప్పటికి ఈ ఐసీసీ టోర్నీకి సంబంధించి మూడు సీజన్లు (2019-2021, 2021-23, 2023-25)ముగిశాయి. ఇందులో తొలి రెండు ఎడిషన్లలో టీమిండియా ఫైనల్‌కు వెళ్లింది.

ఈసారి అదీ లేదు

అయితే, 2021 టైటిల్ పోరులో న్యూజిలాండ్ చేతిలో.. అదే విధంగా 2023 ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక 2023-25 సీజన్‌లో మాత్రం భారత జట్టు ఫైనల్‌కు చేరలేకపోయింది. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో 3-0తో వైట్‌వాష్ కావడం.. ఆస్ట్రేలియా పర్యటనలో బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో 3-1తో ఓడిపోవడం ఇందుకు ప్రధాన కారణం.

### మూడూ ఇంగ్లండ్‌లోనే

ఈ క్రమంలో టీమిండియాపై పైచేయి సాధించిన ఆస్ట్రేలియా- సౌతాఫ్రికాతో కలిసి డబ్ల్యూటీసీ-2025 ఫైనల్‌కు చేరింది. ఇక ఇప్పటి వరకు డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్‌లన్నింటికీ ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చింది.సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్‌లో 2021, ది ఓవల్ మైదానంలో 2023 ఫైనల్‌ను నిర్వహించారు. ఈసారి ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఆసీస్- ప్రొటిస్ జట్లు టైటిల్ కోసం తలపడబోతున్నాయి. ఈ మెగా మ్యాచ్ తర్వాత టీమిండియా- ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టులతో డబ్ల్యూటీసీ 2025-27 సీజన్ ఆరంభం కానుంది.ఈ నేపథ్యంలో ఈసారి భారత్ ఫైనల్ చేరితే తాము ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీసీసీఐ ఐసీసీకి తెలియజేసినట్లు సమాచారం. ఈ మేరకు.. "ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల సమావేశంలో డబ్ల్యూటీసీ ఫైనల్ 2027 బిడ్‌కు సంబంధించి భారత్ తమ ఆసక్తిని తెలియజేసింది.అరుణ్ సింగ్ ధుమాల్ బీసీసీఐ తరఫున ఐసీసీ ముందు ఈ ప్రతిపాదన ఉంచారు. ప్రస్తుతం ఐసీసీ చైర్మన్‌గా.. బీసీసీఐ మాజీ కార్యదర్శి జై షా ఉన్నారు. కాబట్టి భారత్‌కు ఈ బిడ్ దక్కే అవకాశం ఉంది" అని ది గార్డియన్ పేర్కొంది.

### ఐసీసీ నిర్ణయం ఏమిటి?

డబ్ల్యూటీసీ ఫైనల్-2027 వేదికను భారత్‌కు తరలించే విషయంలో ఐసీసీ మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. టీమిండియా ఈ మెగా మ్యాచ్‌కు అర్హత సాధిస్తే ఫర్వాలేదు..

అలా కాని పక్షంలో భారత్‌లో ఈ మ్యాచ్‌కు ఊహించిన స్థాయిలో ఆదరణ లభించదని ఐసీసీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అదే ఇంగ్లండ్‌లో అయితే.. వేసవిలో కౌంటీలతో పాటు ఈ మెగా పోరును వీక్షించేందుకు ప్రేక్షకులు స్టేడియానికి తరలివస్తారనే యోచనలో ఉన్నట్లు సమాచారం. కాబట్టి ఇంగ్లండ్‌నే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు సరైన వేదికగా ఐసీసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఈసారి టీమిండియా ఫైనల్‌కు చేరకపోవడంతో ఇంగ్లండ్ బోర్డుకు టికెట్ల రూపేణా వచ్చే ఆదాయం భారీగా తగ్గినట్లు వార్తలు వచ్చాయి. దాదాపు రూ. 45 కోట్లు మెరిలిబోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నష్టపోయినట్లు కథనాలు వచ్చాయి.

## పాకిస్తాన్‌కు అంత సీన్ లేదు.. త్వరలోనే ఐపీఎల్ మళ్లీ మొదలు: గంగూలీ



ఐపీఎల్-2025 ని వాయిదా వేస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయాన్ని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ స్వాగతించాడు. దేశ సరిహద్దుల వెంబడి నెలకొన్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా బోర్డు సరిగ్గా స్పందించిందని పేర్కొన్నాడు. అయితే, త్వరలోనే ఈ మెగా టోర్నీ మళ్లీ మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశాడు.

### దాయాది దుశ్చర్యలు

పాకిస్తాన్‌కు ఎక్కువ కాలం పోరాడే శక్తి లేదని.. కాబట్టి త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయని గంగూలీ ఈ సందర్భంగా పేర్కొన్నాడు. కాగా పహల్గామ్ ఉగ్రదాడికి బదులు తీర్చుకునేందుకు భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని దాదాపు తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది.

ఉగ్రవాదులను ఏరివేసే క్రమంలో భారత్ చేపట్టిన ఈ చర్యను దాయాది జీర్ణించుకోలేకపోతోంది. అందుకే అనుచితంగా దాడులకు తెగబడుతోంది. ఈ క్రమంలో దాయాది పాక్ దుశ్చర్యలకు భారత్ గట్టి సమాధానిమిస్తోంది. దీంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారి.. రణరంగాన్ని తలపిస్తోంది. ముఖ్యంగా సరిహద్దుల వెంబడి పాక్ ఎక్కువగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూ.. సామాన్యులు, సైనిక స్థావరాలను టార్గెట్ చేస్తోంది. భారత్ ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతోంది. ఈ నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న ధర్మశాల స్టేడియంలో గురువారం పంజాబ్ కింగ్స్- ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోయింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వారం రోజుల పాటు లీగ్‌ను వాయిదా వేస్తున్నట్లు బీసీసీఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది.

### పాకిస్తాన్‌కు అంత సీన్ లేదు

ఈ పరిణామాలపై స్పందించిన బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. "యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ బీసీసీఐ భారత, విదేశీ ఆటగాళ్ల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ?త్వరలోనే లీగ్ మళ్లీ మొదలు కావాలని ఆకాంక్షిద్దాం. ప్రస్తుతం టోర్నీ ప్లే ఆఫ్స్ దశలో ఉంది. ఇలాంటి తరుణంలో ధర్మశాల, చండీగఢ్, ఢిల్లీ, రాజస్తాన్, జైపూర్ వంటి ప్రాంతాలు మినహా.. మిగతా చోట్ల ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఉంది. కాలక్రమేణా పరిస్థితులు చక్కబడతాయనే విశ్వాసం ఉంది. ఎందుకంటే పాకిస్తాన్ ఇలాంటి పరిస్థితులను, ఒత్తిడిని ఎక్కువ కాలం భరించలేదు. ఆ దేశానికి అంతటి సామర్థ్యం లేదు. కాబట్టి బీసీసీఐ కచ్చితంగా ఐపీఎల్-2025ని పూర్తి చేస్తుంది" అని గంగూలీ ధీమా వ్యక్తం చేశాడు.

### సురక్షితంగా ఢిల్లీకి

ఇదిలా ఉంటే.. ధర్మశాలలో మ్యాచ్ రద్దు కాగానే.. బీసీసీఐ పంజాబ్- ఢిల్లీ ఆటగాళ్లను సురక్షితంగా ఢిల్లీకి చేర్చింది. అత్యంత భద్రత నడుమ వందే భారత్ రైలులో ఆటగాళ్లను తరలించింది. కాగా మార్చి 22న మొదలైన ఐపీఎల్-2025లో ఇప్పటికి 57 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. గుజరాత్ టైటాన్స్, ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్ రేసులో ముందున్నాయి. మరోవైపు.. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్తాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎలిమినేట్ అయిపోయాయి. మిగతా మ్యాచ్‌లలో ఢిల్లీ, కోల్‌కతా, లక్నో జట్లు తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి.

